నేడైనా స్పందిస్తారా..?

- నత్తనడకన వ్యవసాయం
- సమస్యల వలయంలో జనం
- నేడు జడ్పీ పాలకమండలి సమావేశం
- లతారెడ్డి, ముద్దుకృష్ణారెడ్డిల ప్రమాణస్వీకారం



జిల్లా పరిషత్ కార్యాలయం

కడప రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజాపరిషత్ పాలకమండలి సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు జడ్పీ మీటింగ్ హాలులో చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి అధ్యక్షతన జరగనుంది. అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమావేశంలో జిల్లాలోని సమస్యలపై గళంవిప్పి పరిష్కారం చూపుతారనే గంపెడాశతో జనం ఎదురుచూస్తున్నారు. అయితే జనం సమస్యలపై స్పందించే దిశగా కాకుండా సర్వసభ్య సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. ఒకప్పుడు పార్టీలతో సంబంధం లేకుండా జిల్లా అభివృద్ధికి బాటలు వేసేలా జడ్పీ సమావేశాలు సాగేవి. మౌలిక వసతులు సమకూరేవి. వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్య సౌకర్యాలు మెరుగుపడేవి. ఇప్పుడు అంతా మొక్కుబడి అయిపోతోంది.

జడ్పీ పాలకమండలి గత మూడు పర్యాయాలుగా వైసీపీ ఆధీనంలోనే కొనసాగుతోంది. ప్రస్తుతం ఉన్న పాలకమండలి ఇప్పటి వరకు దాదాపు 16 జడ్పీ సర్వసభ్య సమావేశాలను నిర్వహించింది. ఒక్కొక్క సమావేశానికి సరాసరిన దాదాపు రూ.4 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారే తప్ప ప్రజాసమస్యలకు పరిష్కారం చూపింది శూన్యం.

శాఖల వారీగా సమస్యలు..

- ఉమ్మడి జిల్లాలో ఎన్నడూ లేనంతగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అదును తప్పి వానలు పడుతున్నాయి. దీంతో మూడేళ్ల నుంచి వ్యవసాయం దారుణంగా దెబ్బతింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇప్పటి వరకు సరైన వర్షాలు లేకపోవడంతో సాగు నత్తనడకన సాగుతోంది. 1,88,520 ఎకాల సాగు లక్ష్యం కాగా ఇప్పటి వరకు కేవలం 17,152 ఎకరాలలో మాత్రమే సాగైంది. తక్కువ వర్షపాతం నమోదు కావడంతో భూగర్భ జలాలు అంతంత మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కల్తీ విత్తనాలు, కల్తీ మందులతో పాటు యూరియా కొరత, అధిక ధరల చెల్లింపు తదితర సమస్యలు రైతులను వెంటాడుతున్నాయి.
- పశుసంవర్ధకశాఖలో పశువైద్యం గాలిలో దీపంలా మారింది. అధికారులు అందుబాటులో ఉండడం లేదని పశుపోషకులు వాపోతున్నారు. పశుగ్రాస విత్తన సరఫరా అంతంత మాత్రమే సాగుతోంది. పెయ్యదూడల సంఖ్య పెంపు గణాంకాలకే పరిమితమవుతోంది.
- జిల్లాలో మొత్తం 2,389 అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిలోచాలా వరకు అద్దె భవనాల్లో అరకొర వసతులతో కొనసాగుతున్నాయి. బాల సంజీవని కిట్స్ పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- ఉమ్మడి జిల్లాలో 1929 ప్రభుత్వ పాఠశాలల్లో 1,10,751 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. చిన్నపాటి వర్షానికే పలు ప్రభుత్వ పాఠశాలలు ఉరుస్తున్నాయి. పలు పఠశాలల్లో ప్రహరీ గోడలు, ఇతర మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.
- పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. ఈ కారణంగా సీజనల్ వ్యాధులతో జనం సతమతమౌతున్నారు. వైద్య ఆరోగ్య కేంద్రాలలో మందుల కొరత వేధిస్తోంది. వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో క్లాప్ మిత్రలు ఆందోళన చెందుతున్నారు. ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత మగ్గుతున్నారు. వీటన్నింటిపై చర్చసాగించి ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది.

నేడు లతారెడ్డి, ముద్దుకృష్ణారెడ్డిల ప్రమాణస్వీకారం

ఉమ్మడి కడప జిల్లాలో ఇటీవల నిర్వహించిన ఉప ఎన్నికల్లో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యులుగా మారెడ్డి లతారెడ్డి, ముద్దుక్రిష్ణారెడ్డి గెలుపొందారు. వారు శనివారం నిర్వహిస్తున్న జడ్పీ సర్వ సభ్యసమావేశానికి మొదటిసారిగా హాజరవుతున్నారు. వారిని పాలకమండలికి పరిచయం చేయడంతో పాటు జడ్పీటీసీలుగా వారితో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

నేతలపై జనం గంపెడాశ

నేటి జడ్పీ సర్వసభ్య సమావేశానికి జిల్లాలో నెలకొన్న సమస్యలపై శాఖలవారీగా సమస్త సమాచారాన్ని తీసుకురావాల్సిందిగా అధికారులకు ఇప్పటికే జడ్పీ సీఈవో ఆదేశాలు పంపారు. ఈ క్రమంలో ఏ యే శాఖలలో ఏ పనులు చేపట్టాలి.. ఎంతెంత నిధులు అందుబాటులో ఉన్నాయనే అంశాలపై చర్చించడంతో పాటు సమస్యలపై గళంవిప్పి పరిష్కారం చూపుతారనే గంపెడాశతో జనం ఎదురుచూస్తున్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు


మాట్లాడుతున్న ఆర్టీసీ కడప ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణామలైలోని అరుణాచలానికి వెళ్లే భక్తులకోసం సెప్టెంబరు 6వ తేదీ శనివారం కడప రీజియన్ పరిధిలోని ఆరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని ఆర్టీసీ కడప ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి వెల్లడించారు. ఆ మేరకు శుక్రవారం కడపలోని ఆయన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిప్రదర్శన కోసం భక్తుల సౌకర్యార్థం కడప రీజియన్ పరిధిలోని డిపోల ద్వారా బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు ముందస్తుగా సీట్లు రిజర్వ్ చేసుకోవాలని కోరారు.

6వ తేదీన బయలుదేరే బస్సుల వేళలు, టికెట్ ధర

డిపో	సమయం	బస్సు	టికెట్
కడప	సాయంత్రం 5	సూపర్‌లగ్జరీ	1,044
బద్వేల్	ఉదయం 9	అల్ట్రాడీలక్స్	1,282
మైదుకూరు	మధ్యాహ్నం 3	సూపర్‌లగ్జరీ	1,209
ప్రొద్దుటూరు	సాయంత్రం 6	సూపర్‌లగ్జరీ	1,273
పులివెందుల	ఉదయం 7	సూపర్‌లగ్జరీ	1,233
జమ్మలమడుగు	సాయంత్రం 5	సూపర్‌లగ్జరీ	1,352

స్టీల్ ప్లాంట్ పనులకు రూ.25 కోట్లు విడుదల

జమ్మలమడుగు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె, కన్నెతీర్థం గ్రామాల మధ్య కడప స్టీల్ ప్లాంట్ పనులకు రూ.25 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ జీవోవిడుదల చేశారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం ఇటీవల జిందాల్ స్టీల్‌ప్లాంట్‌కు భూములను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆ పనులకోసం రూ.25 కోట్లు విడుదల చేసింది.

ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావుకు పదోన్నతి

కడప క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏఆర్ పోలీసు విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న శ్రీనివాసరావుకు అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1991 బ్యాచ్‌కు చెందిన ఈయన ఏఆర్ విభాగంలో పలు జిల్లాల్లో విధులు నిర్వహించారు. 2001లో పదోన్నతి పొంది నెల్లూరు, విజయవాడ, హైదరబాదు, వైజాగ్, తిరుపతిలలో పనిచేశారు. 2011లో ఏఆర్ డీఎస్పీగా పదోన్నతి పొంది ఏపీ జెన్‌కో విజిలెన్స్‌లో విధులు నిర్వహిస్తూ కడపకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఆయన ఏఆర్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. ఏఆర్ అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పించి ప్రభుత్వం ఆయనను ప్రకాశం జిల్లాకు బదిలీ చేసింది.

గండి క్షేత్రంలో హుండీల లెక్కింపు

- రూ.1.96 కోట్ల ఆదాయం

చక్రాయపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో శుక్రవారం హుండీల లెక్కింపు నిర్వహిచామని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. జూలై 25 నుంచి ఈ నెల 23 వరకు గండి క్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలు జరిగాయన్నారు. ఈ రోజులకు గాను హుండీల ఆదాయాన్ని లెక్కించామన్నారు. దేవదాయ శాఖ తనిఖీదారులు సి.శివయ్య పర్యవేక్షణలో, పోలీసు సిబ్బంది, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సిబ్బంది సమక్షంలో హుండీల ఆదాయాన్ని లెక్కించామన్నారు. నగదు రూ.40,71,120, మిక్సడు బంగారం 11 గ్రాములు, మిక్సడు వెండి 900 గ్రాములు, అరబ్ దిర్హామ్స్ 10 వచ్చాయన్నారు. మొత్తం రూ.1,96,07,865 ఆదాయం లభించిందన్నారు. ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, దేవస్థాన ప్రధాన అర్చకులు వర్తికేసరి, ఉప ప్రధాన అర్చకులు వర్తిరాజారమేశ్, ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు పాల్గొన్నారు.


గండి క్షేత్రంలో హుండీ లెక్కింపు దృశ్యం

చుక్ చుక్ బండిలో నిమజ్జనానికి..



నిమజ్జనం కోసం వినాయకుడిని ఎలక్ట్రిక్ రైలులో తీసుకెళుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు రూరల్/ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గణనాథుడిని నిమజ్జనం చేసేందుకు సాధారణంగా ఎడ్లబండి పైన, లగేజీ ఆటోలు, ట్రాక్టర్లలో తీసుకెళ్లడం చూసే ఉంటాం. అయితే ప్రొద్దుటూరులో గణేశ్ శోభాయాత్రలో వినూత్న సంఘటన చోటు చేసుకుంది. ప్రొద్దుటూరుకు చెందిన ఓ వ్యాపార వేత్త రైలును పోలి ఉన్న ఎలక్ట్రిక్ వాహనంలో గణనాథున్ని ఊరేగింపుగా గాంధీ పార్కువద్ద నుంచి తీసుకెళ్లి చెన్నమరాజుపల్లె సమీపంలోని కేసీ కెనాల్‌లో నిమజ్జనం చేశారు. దీంతో అక్కడి వారు 'శంకర్‌జీకా బేటా.. రైలు గాడిమే బైటా' అంటూ ఉత్సాహంగా కేరింతలు కొట్టారు.

చాక్లెట్ గణేశుడు


చాక్లెట్లతో తయారు చేసిన గణపతి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా వీధి వీధిన కొలువుతీరిన గణనాథులు భక్తుల నుంచి పూజలు అందుకుంటున్నారు. ప్రొద్దుటూరులోని శ్రీరాములపేట ఏసీఎన్ కార్యాలయం వెనుకవైపు చాక్లెట్లతో ఏర్పాటు చేసిన గణనాథుడు ఆకట్టుకుంటున్నాడు. పీడబ్ల్యూ కార్యాలయం వద్ద అయ్యప్పస్వామి సెట్టింగ్‌లో వినాయకుడిని కొలువుదీర్చారు. కాగా పట్టణంలో కొన్ని విగ్రహాలను కామనూరులోని కుందూ నదిలో నిమజ్జనానికి తరలించారు.


పీడబ్ల్యూడీ కార్యాలయం వద్ద అయ్యప్పస్వామి సెట్టింగ్‌లో వినాయకుడు

రూ.7,309.49 లక్షలతో చెరువుల మరమ్మతులకు ఆమోదం

కడప కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మైక్రో ఇరిగేషన్ చెరువులు, కాల్వలకు రూ.7,309.49 లక్షలతో మరమ్మతులు చేపట్టేందుకు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆమోదం తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో నీటి వనరుల మరమ్మతులు, పునరుద్ధరణ కార్యక్రమంపై జిల్లా స్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి సంరక్షణను మెరుగుపరచడంతో పాటు అందుబాటులో ఉన్న నీటివనరులను ఉపయోగించడం ద్వారా జిల్లాను కరువుబారిన పడకుండా చేయవచ్చన్నారు. కొన్నేళ్లుగా తగినంత నిర్వహణ లేకపోవడంతో మైనర్ ఇరిగేషన్ పరిధిలోని చెరువుల్లో పూడిక పెరిగిందని, మట్టి కట్టలు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. నీటి పారుదల కాలువలు, తూములు శిధిలావస్థలో ఉన్నాయన్నారు. అలాంటి వాటిపై జిల్లా స్థాయి అమలు పర్యవేక్షణ కమిటీ ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. జిల్లాలో 42,904.12 ఎకరాల ఆయకట్టుకు 138 చెరువులు ఉన్నాయని అందులో 100 చెరువులకు మరమ్మతులు, పునరుద్ధరణ, అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదించామన్నారు. ఇందుకోసం రూ.7,309.49 లక్షలు వెచ్చించేందుకు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌ఈ అబ్దుల్‌షమీ, డివిజన్ ఈఈ వెంకట్రామయ్య, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాలకు రుణాలివ్వాలి

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, అనుబంధ రంగాలకు బ్యాంకర్లు విరివిగా రుణాలు ఇవ్వాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డీఎల్‌ఆర్‌సీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు సకాలంలో క్రాప్‌లోన్లు మంజూరు చేయాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రాధాన్యతా రంగానికి రూ.17,603.11 కోట్ల రుణాలు మంజూరు లక్ష్యం కాగా 2025 జూన్ 30 నాటికి రూ.5,870.08 కోట్లు మంజూరు చేశామన్నారు. జిల్లాలో మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రణాళిక ప్రకారం రుణాలు ఇస్తున్నామన్నారు. ఉద్యానవన, పట్టుపరిశ్రమ, పశుసంవర్ధక శాఖలు బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సమష్టిగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఎల్డీఎం జనార్ధనం, డీఆర్డీఏ, మెప్మా పీడీలు రాజ్యలక్ష్మి, కిరణ్‌కుమార్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు చంద్రానాయక్, రవిచంద్రబాబు, బ్యాంకు అధికారులు లక్ష్మీతులసి, విజయవిహారి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్


సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్న అధికారులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కడపలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్సీ సర్టిపికెట్ల పరిశీలన ముగిసింది. శుక్రవారం 609 నుంచి 712 వరకు అలాగే జోనల్, రాష్ట్రస్థాయి పోస్టులకు సంబంధించి మరో 535 పోస్టులకు కూడా సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 712 పోస్టులు, జోనల్, రాష్ట్రస్థాయిలో 535 పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎస్సీ రాష్ట్ర పరిశీలకులు మధుసూదన్ రావు, కడప, అన్నమయ్య జిల్లాల డీఈవోలు డాక్టర్ షంషుద్దీన్, డాక్టర్ సుబ్రమణ్యం పర్యవేక్షించారు.

1 నుంచి చౌకదుకాణాల్లో జొన్నలు పంపిణీ

కడప కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెల్లరేషన్ కార్డు దారులందరికీ సెప్టెంబరు 1 నుంచి అన్ని డీలర్ షాపులలో బియ్యంతో పాటు జొన్నలు 1కేజీ చొప్పున పంపిణీ చేస్తారని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బియ్యం కార్డులో ముగ్గురు సభ్యులుంటే 1 కేజీ, అంకతంటే ఎక్కువమంది ఉంటే బియ్యం స్థానంలో 2 కిలోల జొన్నలు ఇస్తారని తెలిపారు. ఏఏవై కార్డుదారులకు కూడా 2 కిలోల జొన్నలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

'ప్రాథమిక' కష్టాలు పుట్టెడు..!



మోడల్ ప్రైమరీ స్కూల్ (మైదుకూరు)

ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ కొత్త సంస్కరణలలో భాగంగా మోడల్ ప్రైమరీ స్కూల్ వ్యవస్థ ప్రవేశపెట్టింది. దీనిలో ప్రతి మోడల్ స్కూల్‌కు పీఎస్ హెచ్‌ఎం పోస్టు కేటాయించారు. మొన్న జరిగిన బదిలీల్లో ఆ పోస్టులను భర్తీ కూడా చేశారు. అయితే హెచ్‌ఎం ఒక్కరు మాత్రమే ఉన్న పాఠశాలలో పూర్తిభారం వారిపైనే పడడంతో ఒకపక్క అడ్మినిస్ట్రేషన్ మరోపక్క తరగతులు బోధన కష్టసాధ్యంగా మారిందంటున్నారు. దీంతో బోధన కుంటుపడి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా తగ్గే అవకాశం ఉందని అంటున్నారు.



- అవస్థల్లో ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు
- భారంగా మారిన అడ్మినిస్ట్రేషన్, తరగతుల బోధన

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త పాఠశాలలకు 4,706 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పీఎస్ హెచ్‌ఎంలుగా విద్యాశాఖ కన్వర్షన్ చేసింది. ఉమ్మడి కడప జిల్లాకు 291 పీఎస్ హెచ్‌ఎం పోస్టులు కేటాయించింది. ప్రభు త్వం విడుదల చేసిన ఉత్తర్వు 21 ప్రకారం 1 నుంచి 10వ తరగతి వరకు కొనసాగుతున్న ఉన్నత పాఠశాలలో 5వ తర గతి వరకు విద్యార్థుల సంఖ్య 31 దాటిన చోట ఒక పీఎస్ హెచ్‌ఎంతో పాటు ముగ్గురు ఎస్జీటీ పోస్టులు మంజూరు చేశారు. 45 మంది విద్యార్థులు దాటిన ప్రతి పాఠశాలను మోడల్ ప్రైమరీగా మార్చి పీఎస్ హెచ్‌ఎం పోస్టును సృష్టిం చారు. విద్యార్థులు 59 వరకు ఒక పీఎస్ హెచ్‌ఎం, ముగ్గురు ఎస్జీటీలు, 60 నుంచి ఒక పీఎస్ హెచ్‌ఎం, నాలుగు ఎస్జీటీలు మంజూరు చేశారు. దీని మేరకే తాజాగా జరిగిన బదిలీలలో ఖాళీలు చూపించారు. అయితే ప్రభుత్వం ఎన్నడూ లేనివిధం గా స్కూల్ అసిస్టెంట్లను పీఎస్ హెచ్‌ఎంలుగా పంపింది. వీరు జూన్ 9న తమ విధుల్లో చేరారు. అక్కడి నుంచి వారి కి కష్టాలు మొదలైనట్లు తెలుస్తోంది.

అడ్మినిస్ట్రేషన్‌తో పా టు తరగతుల బోధన పెనుభారంగా మారిందని వాపోతున్నారు. లాంగ్వేజ్ స్కూల్ అసిస్టెంట్లు, నాన్ లాంగ్వేజ్ పాఠ్యాంశాలు బోధించాల్సి వస్తోంది. దీనితో పాటు మోడల్ ప్రైమరీలకు కేటాయించిన ఎస్జీటీలు అన్నీ భర్తీకాక, భర్తీ అయినా రిలీవర్ లేక సిబ్బంది కొరత వేధిస్తోంది. తల్లికి వందనం, ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం ఉచిత ప్రవేశాల వల్ల ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులు తరలివెళ్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య పెంచాలంటూ పీఎస్ హెచ్‌ఎంలపై కొన్నిచోట్ల ఒత్తిడి పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

పోస్టులన్నీ భర్తీ అవుతాయి..



ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ ప్రభుత్వం త్వరలోనే భర్తీ చేయనుంది. ప్రస్తుతం డీఎస్సీ ద్వారా భర్తీ చేసి మిగిలిన పోస్టులను విద్యా వలంటీర్ల ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏ ఒక్క పాఠశాలలో కూడా ఉపాధ్యాయుడు లేకుండా బోధన ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

\- షంషుద్దీన్, డీఈవో

వందమందికి ఒక్కరే..

- రాయచోటిలోని ఓ ప్రభుత్వ యాజమాన్య మోడల్ ప్రైమరీ పాఠశాలలో వంద మందికి పైగా విద్యార్థులు ఉన్నా అక్కడ కేవలం ఒక పీఎస్ హెచ్‌ఎం మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా నలుగురు ఎస్జీటీలు అవసరం ఉన్నా భర్తీ కాలేదు. దీనితో వంద మందికి ఒక్కరే తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.
- గోపవరం మండలం కాల్వపల్లె ఉన్నత పాఠశాలలోని ప్రాథమిక పాఠశాలలో కేవలం ఒక పీఎస్ హెచ్‌ఎం మాత్రమే పనిచేస్తున్నారు. ఎస్జీటీల నియామకం కాలేదు. ఐదు తరగతులకు ఒక్కరే దిక్కయ్యారు. బోధనా సిబ్బంది కొరత వల్ల అక్కడ ఉన్న విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతున్నట్లు తెలుస్తోంది.

కుంటుపడుతున్న బోధన

కొన్నిచోట్ల పీఎస్ హెచ్‌ఎం కూడా 1 నుంచి 5వ తరగతి వరకు కచ్చితంగా అన్ని సబ్జెక్టులు చెప్పాలని కొంతమంది ఎంఈఓలు నిర్దేశం చేస్తున్నారు. దీనితో అడ్మినిస్ట్రేషన్‌తో పాటు పీఎస్ హెచ్‌ఎంలు బోధన మీద దృష్టి పెట్టడం అసాధ్యంగా మారుతోంది. దీనితో 5వ తరగతి విద్యార్థులకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. మరికొన్ని చోట్ల పీఎస్ హెచ్‌ఎంలుగా ఉన్న హిందీ, తెలుగు స్కూల్ అసిస్టెంట్లు సైన్స్, గణితం బోధించడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇలా అనేక రకాల సమస్యలతో మోడల్ ప్రైమరీ పాఠశాలు కొట్టుమి ట్టాడుతున్నాయి. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ఖాళీలన్నీ భర్తీ చేయాలని పలువురు ప్రధానోపా ధ్యా య ు ు ల ు కోరుతున్నారు.



బస్సు బైక్ ఢీ - రైతు దుర్మరణం

తంబళ్లపల్లె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు-బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో రైతు శ్రీనివాసులరెడ్డి (50) దుర్మరణం చెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు తంబళ్లపల్లె మండలం రెడ్డికోట పంచాయతీ కొప్పులవారిపల్లె వాసి శ్రీనివాసులరెడ్డి సొంతపనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో కోటకొండకు వస్తుండగా మార్గమధ్యలో గుండాలవంక మలుపు వద్ద ఆర్టీసీ బస్సు- బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో ఉన్న రైతు శ్రీనివాసులరెడ్డిని స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో అత్యవసర విభాగం వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంపై ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి


రామ్లానాయక్ (ఫైల్‌ఫొటో)

సుండుపల్లె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నీటి గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని మాచిరెడ్డిగారి పల్లె పంచాయతీ చిన్నబిడికీకి చెందిన రామ్లానాయక్ (70) గురువారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శుక్రవారం మధ్యాహ్నం పింఛా నది సమీపం లోని నీటి గుంతలో అతని మృతదేహాన్ని బాటసారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మృతదేహాన్ని వెలికి తీయించి చిన్నబిడికీ వాసిగా గుర్తించామని ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..

కలికిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి కాగితి నరేష్ (40) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కలకడ మార్గంలోని అంకాలమ్మ గుడి సమీపంలోని ఉమ్మనగుంట చెరువు లోకి దిగాడు. పట్టుతప్పి నీళ్లలోకి పడ్డాడు. ఈత రాకపోవడంతో మునిగి చనిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఏఎస్ఐ మహబూబ్ సాహెబ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడికి 14 రోజుల రిమాండ్

నిమ్మనపల్లి ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతీ దాసరిపేట వాసి తుపాకుల రోహిత్ కుమార్‌కు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. వివరాల్లోకెళ్తే.. దాసరిపేటలో వినాయక ప్రతిమను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కమిటీ సభ్యులు గురువారం రాత్రి హిజ్రాలతో అసభ్యకర డ్యాన్సులు వేసేందుకు ప్రణాళిక వేశారు. ఈ క్రమంలో గురువారం కమిటీ సభ్యులు ప్రసన్న కుమార్, కొండప్ప, హేమంత్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. కాగా వీరివెంటే వెళ్లిన సదరు గ్రామానికి చెందిన రోహిత్‌కుమార్ స్టేషన్‌లో గందరగోళం సృష్టించి పోలీసులను దుర్భాషలాడి దాడికి యత్నించినట్లు ఎస్ఐ తెలిపారు. దీంతో కానిస్టేబుల్ హరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరచగా జడ్జి 14 రోజులు రిమాండు విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులు
మరో మూడు నెలల పొడిగింపు

రాయచోటి(నేతాజీసర్కిల్)/కడప కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో కాలపరిమితిని మరో మూడు నెలలపాటు పొడిగిస్తున్నట్లు సమాచార పౌరసంబంధాలశాఖ సంచాలకుడు హిమాన్షు శుక్లా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆగస్టు 31 వరకు అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్న పాత్రికేయులకు సెప్టెంబరు 1, నుంచి నవంబరు 30 వరకు, నూతన అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియ ఏది ముందు జరిగితే అప్పటి వరకు పొడిగింపు ఉత్తర్వులు అమలులో ఉంటాయని ఆయన తెలిపారు.

డ్రైవర్‌కు నాలుగున్నరేళ్లు జైలు


డ్రైవర్‌తో కోర్టు కానిస్టేబుల్

రాజంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును ఢీకొని ఆరుగురి మృతికి కారణమైన కేసులో సిమెంటు ట్యాంకర్ డ్రైవర్‌కు నాలుగున్నరేళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజంపేట 3వ అదనపు జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. 2023 జూలై 20న డ్రైవర్ మహదేవ మద్యం మత్తులో సిమెంటు ట్యాంకర్‌తో ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మరణించగా 29 మందికి గాయాలయ్యాయి. అప్పటి ఓబులవారిపల్లె ఎస్ఐ బి.శ్రీకాంత్‌రెడ్డి కేసు నమోదు చేశారు. రాజంపేట ఇన్‌చార్జి సీఐ నరసింహారావు, అనంతరం డీఎస్పీ వీఎన్‌కే చైతన్య దర్యాప్తు చేసి కోర్టుకు చార్జీషీటు సమర్పించారు. 56 మంది సాక్షులను విచారణ చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిజాంజానీ, రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే, కోడూరు రూరల్ సీఐ పి.వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె ఎస్ఐ పి.మహేష్, సాక్షులను సమయానికి కోర్టులో ప్రవేశపెట్టిన కోర్టు కానిస్టేబుల్ (862) వెంకటరమణలను ఎస్పీ అభినందించారు.

అనంతపురం ఎఫెక్ట్..!

- తిరోగమనంలో మదనపల్లె మార్కెట్
- లబోదిబోమంటున్న రైతులు

సగానికి తగ్గిన టమోటా ధరలు




మదనపల్లె మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన టమోటా, (ఇన్‌సెట్లో) మార్కెట్ కమిటీ కార్యాలయం

మదనపల్లెటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోటా మార్కెట్‌కు అనంతపురం టమోటా మార్కెట్ దెబ్బతీస్తోంది. గత పది రోజులుగా మదనపల్లె మార్కెట్‌కు విక్రయానికి వస్తున్న టమోటా 80 శాతం తగ్గిపోగా, ధరలు కూడా సగానికి సగం తగ్గిపోయాయి. దీంతో రైతులు బేర్ మంటున్నారు. నిత్యం 1500 టన్నుల టమోటా విక్రయానికి వస్తున్న పరిస్థితి నుంచి నేడు కేవలం నిత్యం 90 టన్నుల టమోటా మాత్రమే విక్రయానికి వస్తుండటం చూస్తే మదనపల్లె మార్కెట్ ఎంత అధ్వాన స్థితికి దిగజారిందో.. తద్వారా మార్కెట్ వార్షిక ఆదాయంపై పెద్ద దెబ్బపడుతోంది.

మదనపల్లె మార్కెట్ దినదినం తిరోగమనం

దేశంలోనే అతి పెద్ద టమోటా మార్కెట్‌గా పేరొందిన మదనపల్లె దినదిన ప్రవర్ధమానం కాకుండా దినదినం తిరోగమనంలోకి పడిపోతోంది. 11 ఎకరాల విస్తీర్ణం వున్న మార్కెట్ ఇరుకుగా మారిపోవడం, లారీ యూనియన్ల మధ్య సమ స్యలు, టమోటా లోడింగ్, అన్‌లోడింగ్, జాక్‌పాట్ విధానం, క్రేట్లకు బాడుగ తీయడం, ముఖ్యంగా ఉదయం మార్కెట్‌కు వచ్చిన రైతులకు టమోటా ట్రేడర్స్ సాయంత్రం వరకు టమోటా బిల్లులకు డబ్బులు చెల్లించకోవడం వెరసి మదనపల్లె మార్కెట్ దినదినం అథోగతి పాలవుతోంది. దీంతో టమోటా సీజన్ ముగియకనే ఇక్కడికి ప్రతిరోజు 1500 టన్నులు నుంచి నేడు 90 టన్నుల వరకు మాత్రమే విక్రయాలకు పడిపోయాయి. ఈ దెబ్బకు ఇక్కడి టమోటా ధరలు కూడా సగానికి సగం పడిపోతున్నాయి.

గత రెండు నెలలుగా మదనపల్లె మార్కెట్‌లో టమోటా ధరలు నిలకడగానే సాగాయి. కాని నాలుగు రోజులుగా ధరలు ఒక్కసారిగా సగానికి సగం పడిపోయాయి. గత జూన్, జూలై నెలలు, ఆగస్టు 22వ తేది వరకు మదనపల్లె మార్కెట్‌లో టమోటా గరిష్టంగా కిలో రూ.50 పలుకగా, కనిష్టగా కిలో రూ.20 పలికాయి. ఈ ధరలు పలికిన సమయంలో రైతులకు గిట్టుబాటు ధరలతో పాటు కాస్త లాభాలు కళ్ల చూసారు. కాని ఆగస్టు 22వ తేది నుంచి మదనపల్లె మార్కెట్‌లో టమోటా ధరలు ఒక్కసారిగా పతనం అవుతున్నాయి. గరిష్ట ధర కిలో రూ. 50 నుంచి రూ.44, రూ.36, రూ.26కు పడిపోయాయి. అలాగే కనిష్ట ధర కూడా కిలో రూ.20 నుంచి కిలో రూ.15 వరకు పడిపోయింది. అంతేకాకుండా జూన్ నెలలో ప్రతిరోజు మార్కెట్‌కు సరాసరిన 1500 మెట్రిక్ టన్నుల టమోటా విక్రయానికి రాగా, జూలైలో వెయ్యి మెట్రిక్ టన్నుల టమోటా విక్రయానికి వచ్చింది. కాని జూలై 18వ తేది నుంచి మార్కెట్‌కు వచ్చే టమోటా గణనీయంగా తగ్గిపోతూ ప్రతి రోజు 500 మెట్రిక్ టన్నులకు పడిపోయింది. ఇదే ఆగస్టు నెల ప్రారంభంలో 300 టన్నులు రాగా నేడు కేవలం 96 మెట్రిక్ టన్నులకే టమోటా దిగుబడి పడిపోయింది.

అనంతపురం సీజన్ ఎఫెక్ట్...

అనంతపురం జిల్లాలో జూలై నెల నుంచి టమోటా దిగుబడి ప్రారంభమవుతుంది. ముఖ్యంగా వేడి వాతావరణం పోయి, వాతావరణం చల్లబడటం, వర్షాలు పడుతుండటంతో అక్కడి టమోటా తోటల్లో దిగుబడి ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో వ్యాపారులు కూడా మదనపల్లె మార్కెట్‌ను వదిలేసి అనంతపురం మార్కెట్‌కు పోలోమంటూ వెళ్లిపోయారు. ఇది కూడా మదనపల్లె మార్కెట్‌లో ధరలు పడిపోవడానికి ఒక కారణంగా చెబుతున్నారు. అంతేకాకుండా ఇక్కడ సీజన్ ముగుస్తుండడంతో టమోటా నాణ్యత కూడా తగ్గిపోవడం మరో కారణంగా చెప్పవచ్చు. అంతేకాకుండా మదనపల్లె మార్కెట్‌తో పోలిస్తే ములకలచెరువు, అంగళ్లు, గుర్రంకొండ మార్కెట్‌లో రైతులు తీసుకొచ్చే టమోటాలకు మంచి ధరలు వస్తుండటంతో రైతులు ఈ మార్కెట్‌లకే ప్రాధాన్యత ఇస్తూ మదనపల్లె మార్కెట్‌ను తిరస్కరిస్తున్నారు. దీంతో దేశంలో అతిపెద్ద టమోటా మార్కెట్‌గా పేరుపొందిన మదనపల్లె మార్కెట్ తిరోగమనంలో పడిపోతోంది. మదనపల్లె టమోటా మార్కెట్‌కు గతంలో మార్కెట్ సెస్సు కింద వసూలు చేయడం, మండీల అద్దెలు, మార్కెట్‌లో షాపింగ్ గదుల అద్దె కలిపి వార్షిక ఆదాయం రూ.3కోట్లకు పైగా వచ్చేది. భవిష్యత్‌లో పై తెలిపిన పరిస్థితులు కొనసాగితే మదనపల్లె మార్కెట్ వార్షిక ఆదాయం గణనీయంగా పడిపోయి, సగానికి సగం తగ్గిపోయినా ఆశ్చర్యపడనవసరం లేదని విశ్లేషకుల అభిప్రాయం. ఇకనైనా జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు మదనపల్లె మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాల్సి వుంది.

రాజంపేట పూర్వ ఆర్డీఓపై విచారణ

- కోర్టు కేసుల్లో ప్రభుత్వానికి చిక్కులు
- ఇప్పటికే సస్పెన్షన్‌లో వున్న కోదండరామిరెడ్డి
- విచారణాధికారిగా జేసీ ఆదర్శ రాజేంద్రన్

కలికిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పూర్వ ఆర్డీఓ, ప్రస్తుతం తిరుపతి గాలేరు నగరి యూనిట్-1 ఎస్‌డీసీ డి.కోదండరామిరెడ్డిపై విచారణకు ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. విచారణాధికారిగా అన్నమయ్య జిల్లా జేసీ ఆదర్శ రాజేంద్రన్‌ను, ప్రెజెంటింగ్ అధికారిగా డీఆర్ఓ కె.మధుసూదనరావును నియమించింది. రెండు నెలల్లోగా విచారణ ముగించి నివేదిక అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రాజంపేట ఆర్డీఓగా, జీఎన్ఎస్ఎస్ భూసేకరణ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా అదనపు బాధ్యతలు నిర్వహించే సమయంలో ఒక కోర్టు కేసులో అనాలోచితంగా వ్యవహరించి తీవ్ర తప్పిదాలకు పాల్పడడంతో ప్రభుత్వానికి కోర్టులో ఇబ్బందులెదురయ్యాయి. చాలా రోజుల విచారణ అనంతరం గతేడాది ఆగస్టు 30న ప్రభుత్వం కోదండరామిరెడ్డిని సస్పెండ్ చేసింది. అనంతరం ఆయన సంజాయిషీలు సంతృప్తికరంగా లేకపోవడంతో డిసెంబరు 13న ఆయనపై ప్రభుత్వం అభియోగాలు నమోదు చేసి నోటీసులు జారీ చేసింది. దీనికి సంబంధించిన పూర్వాపరాలు ఇలా వున్నాయి.

సోమశిల ప్రాజెక్టు కింద 54 ముంపు గ్రామాలకు పునరావాసం, పరిహారాల చెల్లింపులపై ఆ గ్రామాల తరపున కె.నాగిరెడ్డి 2022లో హైకోర్టులో కేసు వేశారు. ఈ కేసు కారణంగా సోమశిల ఫేజ్-2లో ముందుకెళ్లడానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. అయితే జీఓ నెం.68 ప్రకారం, కొత్త భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం, పరిహారాల చెల్లింపులు సాధ్యపడదని, అది ప్రభుత్వ ఖజానాపై తీవ్ర భారం పడుతుందని కోదండరామిరెడ్డి హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. వాస్తవానికి ఈ కేసులో ఈయనతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి, కడప, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల కలెక్టర్లు, కడప భూసేకరణ ఆర్డీఓలు ప్రతివాదులుగా వున్నారు. అయితే వీళ్లలో ఎవరి ప్రమేయం లేకుండానే అందరి తరపున కోదండరామిరెడ్డి జీఓ 68ని ఉటంకిస్తూ కౌంటర్ దాఖలు చేశారు. చివరికి తేలిందేమిటంటే అసలు జీఓ68 సోమశిల ముంపు ప్రాంత రైతులకు సంబంధించినది కాకపోవడం. అంతేగాకుండా 54 ముంపు గ్రామాల్లో 25 గ్రామాలు మాత్రమే రాజంపేట యూనిట్ పరిధిలోకి అంటే కోదండరామిరెడ్డికి సంబంధించినవి మాత్రమే. మిగిలిన 29 గ్రామాలు కడప భూసేకరణ విభాగానికి సంబంధించినవి. ఇదిలా వుండగా ఉన్నతాధికారులతో సంప్రదించకుండానే కోదండరామిరెడ్డి జీఓ 68ని తెరపైకి తెచ్చి హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయడంతో ప్రభుత్వానికి చిక్కులెదురయ్యాయి. దీని కారణంగా సోమశిల ఫేజ్-2 ముందుకెళ్లడానికి అడ్డంకులేర్పడ్డాయి. ఈ విషయంపై పూర్తి విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఆర్.పి.సిసోడియా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

తెలుగును నిర్బంధం చేయాలి

- అవధాని లోకజగన్నాథశాస్త్రి


సభలో మాట్లాడుతున్న అవధాని లోకజగన్నాథశాస్త్రి

కలకడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ స్థాయిలో తెలుగు మాధ్యమాన్ని నిర్బంధం చేసే దిశగా చట్టంలో మార్పులు తేవాలని అవధాని లోకజగన్నాథశాస్త్రి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా బాటవారిపల్లె జడ్పీ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భాష మనుగడకు వ్యవహర్తలే మూలమన్నారు. కడపకు చెందిన రంగస్థల కళాకారుడు మధుబాబు తెలుగు భాషా విశిష్టతను విద్యార్థులకు వివరించారు. తన రాగాలాపనతో కార్యక్రమాన్ని రంజింపచేశారు. క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాయామ ఉపాధ్యాయుడు మురళీ హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్ దేశఖ్యాతిని ప్రపంచస్థాయిలో తెలియజేశాడని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని యువత క్రీడల్లో రాణించాలని కోరారు. అంతకుమునుపు హెచ్ఎం వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలోని కవుల శిలావిగ్రహాలు, గిడుగు రామ్మూర్తిపంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల మైదానంలో విద్యార్థులు, ఆకృతిగా ఏర్పడి తెలుగుభాషపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాదేవి, మధు, శ్రీరాములనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘర్షణ పడిన ఇరువర్గాలు అదుపులోకి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సీటీఎంలో గురువారం రాత్రి రెడ్డిశేఖర్, చిన్నరెడ్డెప్ప ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. రాత్రి సదుమనిగిన గొడవ శుక్రవారం ఉదయాన్నే రెడ్డిశేఖర్‌కు చెందిన వారు సుమారు 20 మంది సీటీఎంలోని చిన్నరెడ్డప్పకు సంబంధించిన వారి ఇళ్లపై దాడి చేశారు. వారు వెంటనే తాలుకా సీఐ కళా వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలను పిలిపించి అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఈ మేరకు వీధిరౌడీలుగా ఇళ్లపై దౌర్జన్యం చేసిన రెడ్డి శేఖర్ వర్గీయులపై పోలీసులకు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ విషయంలో ఇరువర్గాలను విచారిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నేడు తిరుపతి-కాచిగూడకు ప్రత్యేక రైలు

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మధ్య కడప మీదుగా ప్రత్యేక వీక్లీ రైలును శనివారం నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ రైలు శనివారం రాత్రి 9.10గంటలకు తిరుపతిలో బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప మీదుగా 31వ తేదీ సోమవారం ఉదయం 11గంటలకు కాచిగూడకు చేరుకుంటుందన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

- అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు
- విజిలెన్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బాబుమోసెస్


గోడౌన్‌లో ఎరువులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పీలేరురూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కడప విజిలెన్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బాబుమోసెస్ హెచ్చరించారు. శుక్రవారం పీలేరు పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో కడప విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాలను క్యాష్ చేసుకోవాలని చూస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పీలేరులో యూరియా కొరత ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రెండుమూడు రోజుల్లో యూరియా రైతుల అవసరాల మేరకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. వ్యాపారులు ఎక్కువ ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా సెక్షన్ 6(ఏ) ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎన్ని రకాల ఎరువులు విక్రయిస్తున్నారు. వాటి ధర, స్టాకు వివరాలు విధిగా నోటీస్ బోర్డులో ఎంటర్ చేయాలని చెప్పారు. రైతులు తీసుకునే ఎరువులు, విత్తనాలకు సంబంధించి విధిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ఏవో రమాదేవి మాట్లాడుతూ రైతుల అవసరాలకు అనుగుణంగా వచ్చిన యూరియాను ఎప్పటికప్పుడు రైతుసేవా కేంద్రాల ద్వారా విక్రయిస్తామని చెప్పారు. పీలేరులో ఉన్న ఎరువుల దుకాణాల్లో ఎక్కడా యూరియా లేదని తెలిపారు. విజిలెన్స్ అధికారులు పట్టణంలోని కిసాన్, అగ్రిక్లీనిక్, మారుతి ఫెర్టిలైజర్స్, సురేంద్రరెడ్డి షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. స్టాకు రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎరువుల గోడౌన్లలో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు.

14 వేల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ లక్ష్యం

- ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీప్రసన్న


సోంపల్లెలో అవగాహన కల్పిస్తున్న ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీప్రసన్న

ములకలచెరువు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 సంవత్సరానికి గానూ 14వేల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ అమలుకు లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీప్రసన్న అన్నారు. మండలంలోని సోంపల్లెలో శుక్రవారం డ్రిప్ పరికరాల నిర్వహణ, నీటి ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ములకలచెరువులలో శుక్రవాం పొలాల్లో అమర్చిన డ్రిప్‌ను పరిశీలించారు. అనంతరం ములకలచెరువులోని రైతు సేవా కేంద్రంలో ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి మైక్రో ఇరిగేషన్ రిజిస్ట్రేషన్, ప్రాథమిక సర్వే తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 10577 మంది రైతులు 12,711.71 హెక్టార్లలో ఆన్‌లైన్ ద్వారా డ్రిప్ పరికరాలకు నమోదు చేసుకున్నారన్నారు. ఐదు ఎరకాలలోపు విస్తీర్ణం కలిగిన ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీతో పరికరాలు అందిస్తున్నామన్నారు. అలాగే 10 ఎకరాల లోపల విస్తీర్ణం కలిగిన అన్ని వర్గాల రైతులకు 90శాతం రాయితీ, 10 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన అన్ని వర్గాల రైతులకు 50 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. రైతుసేవా కేంద్రాల సిబ్బంది తన పరిధిలోని నీటి వసతి కలిగిన రైతులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించి ప్రాథమిక సర్వేలు చేపట్టి అంచాలు పూర్తి చేయాలన్నారు. రాయితీ పోయి రైతులు చెల్లించాల్సిన వాటాను ఈజీ పే ద్వారానే చెల్లించేలా చూడాలన్నారు. ఎవరు కూడా రైతుల నుంచి నగదు రూపంలో తీసుకోరాదన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల ఉద్యానవనశాఖాధికారి భీమేష్, ఎంఐడీసీ హరినారాయణ, ఎంఐఈ కృష్ణానాయక్, ఎంఐఏవో స్వాతి తదితరులు పాల్గొన్నారు.

4న 5కే రెడ్ రన్ మారథాన్


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నివారణ సంస్థ సంయుక్తంగా యువతకు నిర్వహిస్తున్న 5కే రెడ్ రన్ మారథాన్ కార్యక్రమంపై డీఎంహెచ్‌వో డాక్టర్ కే. లక్ష్మీనరసయ్య గురువారం తన ఛాంబర్‌లో జిల్లాలోని అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్‌వో రమేష్‌బాబు మాట్లాడుతూ సెప్టెంబరు 4వ తేదీ ఉదయం 5.30 గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమయ్యే ఈ రన్ నారాయణరెడ్డి పల్లె వరకు వెళ్లి యూటర్న్ తీసుకుని తిరిగి కళాశాల వద్దకు చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న 17 నుంచి 25 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులని తెలిపారు. పరుషులకు, మహిళలకు, ట్రాన్స్‌జెండర్‌లకు వేరు వేరుగా మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.7 వేలు ఇవ్వనున్నట్లు వివరించారు. తెలిపారు. ఔత్సాహికులు అన్ని ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లోని ఎన్ఎస్ఎస్ అధికారుల ద్వారా గూగుల్ ఫారం లింక్ ద్వారా తప్పకుండా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఇతర వివరాలకు మస్తాన్ క్రీడాశాఖ అధికారి 7386901200 పీవీ ప్రసాద్, జిల్లా సూపర్‌వైజర్ 9959550368 వెంకటరావు, పీవీ విశ్వప్రసాద్ ఆర్ఆర్‌సీ కోఆర్డినేటర్స్ (9490782453, 9502374642), ప్రాజెక్టు మేనేజర్ టీ. స్వాతి 7569166129లను సంప్రదించాలని జిల్లా అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవ పథకం (ఎన్ఎస్ఎస్) అధికారి ఎం. రాంమోహన్‌రెడ్డి, గుర్రప్ప, జిల్లా క్రీడాశాఖాధికారి మస్తాన్, గౌస్‌బాషా, జిల్లా నెహ్రూ యువ కేంద్ర మై భారత్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, ఇంటర్ విద్యాశాఖ డీఐఈవో రవి, జిల్లా రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ వెంకటరావు, విశ్వప్రసాద్, క్లస్టర్ ప్రోగ్రాంమేనేజర్ వీ. భాస్కర్, క్రీడాశాఖ కోచ్ శ్రీనివాసరాజు, డీపీపీసీయూ, పీసీఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

శతకవుల చిత్రాల ప్రదర్శన

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా సంబేపల్లె ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ నేతృత్వంలో శుక్రవారం వంద మంది శతకవుల చిత్రాల ప్రదర్శనతో తెలుగు తల్లికి నీరాజనాలు అర్పించారు. విద్యార్థుల తెలుగు పద్యాలు, పాటల ఆలాపన, సంప్రదాయ నృత్యాల ప్రదర్శన అలరించింది. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా పీడీ షామీర్ నేతృత్వంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.


100 మంది కవుల చిత్రాలతో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



ఆందోళన వద్దు...

● అప్పీల్ చేసుకున్న వారికి యథావిధిగా వికలత్వపు పింఛన్ల పంపిణీ ● జిల్లాలో 6వేల మందికి ప్రయోజనం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వికలాంగుల పింఛన్లలో అనర్హులను తొలగించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఏపీలో పెన్షన్లపై గత కొన్ని రోజులుగా రాజకీయంగా చర్చ సాగుతోంది. ఇప్పటికే అర్హత లేనివారు పెన్షన్లు పొందుతున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులు గుర్తించారు. దీంతో పెన్షన్ల తొలగింపుపై కొందరికి నోటీసులు జారీ చేశారు. ఏదైనా సాంకేతిక కారణాల వల్ల అర్హులైన వారు నష్టపోయే పరిస్థితి ఉంటే తిరిగి పునఃపరిశీలన కోసం నోటీసు అందిన 30 రోజుల్లోపు ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రం అందిస్తే వికలాంగులకు ఉన్న వికలత్వపు శాతంపై వైద్య బృందంపై స్పష్టత ఇవ్వనుంది. ఈక్రమంలో నిజమైన అర్హులకు మాత్రమే ప్రయోజనం చేకూరుతుందనేది ప్రభుత్వ ఉద్దేశ్యం. ఇదిలా ఉండగా అనర్హులుగా నోటీసులు అందుకున్న వారు అధికారులకు తమ అప్పీల్ సమర్పిస్తున్నారు. ఇలాంటి వారందరికీ వికలత్వం పునఃపరిశీలన పూర్తయ్యేంత వరకు పింఛన్లను యదావిధిగా కొనసాగించనున్నారు.

అయినా.... ఆందోళన

వికలాంగుల పింఛన్ రద్దుపై రాజకీయంగా విమర్శలు మొదలయ్యాయి. కొంతమంది గందరగోళం సృష్టిస్తున్నారు. ఈ క్రమంలో దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఎవరైతే అప్పీలు సమర్పించుకున్నారో వారికి మాత్రం సెప్టెంబరు 1న పింఛను పంపిణీ యదావిధిగా చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో వినతి సమర్పించిన దివ్యాంగులందరికీ సెప్టెంబరులో యదావిధిగా పెన్షన్లు అందుతాయన్నది స్పష్టమవుతుంది. దీనిపై ఎవ రూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దివ్యాంగుల పెన్షన్లకు సంబంధించి ఇటీవల సదరం సర్టిఫికెట్లు రీవెరిఫికేషన్ చేశారు. అందులో 40శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్న వారికి సెప్టెంబరు నుంచి పెన్షన్ నిలిపేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతుంది. అర్హత ఉన్న ఏ ఒక్కరికీ పెన్షన్ కోత ఉండదని ప్రభుత్వం అభిప్రాయం. అందరికీ సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వికలత్వం పునఃపరిశీలన పూర్తయిన తరు వాత అప్పీళ్లకు వెళ్లిన వారికి వారి వికలత్వం శాతం బట్టి పెన్షన్ అమలు చేయనున్నారు.

జిల్లాలో 6వేల మందికి ఉపశమనం

జిల్లాలో రద్దయిన వికలత్వపు పింఛన్లలో సుమారు 6వేల మందికి ఉపశమనం కలగనుంది. ఆన్‌లైన్ ప్రాంతాల్లో వినతులు సమర్పించడానికి 30న సాయంత్రం 5గంటలకు అనుమ తించనున్నారు. ఆఫ్‌లైన్ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం 5గంటల వరకు వినతులు స్వీకరించడానికి గడువు విధించారు. ఈ క్రమంలో జిల్లాలో వినతులు సమర్పించిన వారి వివరాలిలా...

అట్లూరు మండలంలో 65 దివ్యాంగ పింఛన్లు తొలగించగా 56 మంది అప్పీలు చేసుకున్నారు. అదే విధంగా బి.కోడూరులో 116 మందికి గాను 80 మంది, బద్వేలు మండలంలో 81 మందికి 78 మంది, బద్వేలు మున్సిపాలిటీ ఏరియాలో 113 మందికి 72 మంది అప్పీలు చేసుకున్నారు. గోపవరం మండలంలో 88 మందికి 72 మంది, కలసపాడు మండలంలో 115 మందికి 114, పోరుమామిళ్ల మండలంలో 117 మందికి 114, కాశినాయన మండలంలో 103 మందికి 71, జమ్మలమడుగు మండలంలో 83 మందికి 80, మున్సిపల్ ఏరియాలో 79 మందికి 79 మంది అప్పీలు చేసుకున్నారు. కొండాపురం మండలంలో 300 మందికి 273, ముద్దనూరు మండలంలో 294 మందికి 266, మైలవరం మండ లంలో 115 మందికి 113, పెద్దముడియం మండలంలో 163 మంది కి 152, ఎర్రగుంట్ల మండలంలో 105 మందికి 95, మున్సిపాలిటీ పరిధిలో 54 మందికి 58 మంది అప్పీలు చేసుకున్నారు.

కడప నగరపాలకపరిధిలో 538 మందికి 211, కొన్ని వికలత్వపు పింఛన్ల కింద ఓఏపీ కిందమార్పు చేశారు. అలాంటి వారికి కూడా వికలత్వ పింఛను కింద ఆన్‌లైనులో 629 మంది నమోదు చేసుకున్నారు. సిద్దవటం మండలంలో 45కు 32 మంది, ఒంటిమిట్ట మండలంలో 66కు 55 మంది, చెన్నూరు మండలంలో 99 మందికి 104, చింతకొమ్మదిన్నె మండలంలో 154 మందికి 149, కమలాపురం మండలంలో 227మందికి 211, పెండ్లిమర్రి మండలంలో 232 మందికి 50, వల్లూరు మండలంలో 78 మందికి 79, వీరపునాయునిపల్లె మండలంలో 166 మందికి 84 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. అదే విధంగా బ్రహ్మంగారిమఠం 125మందికి 115, చాపాడు మండలం లో 210కి 102 మంది, దువ్వూరు మండలంలో 246కు 217 మంది, మైదుకూరు మండలంలో 126కు నలుగురు మాత్రమే ఆన్ లైన్‌లో నమోదు చేసుకున్నారు. మైదుకూరు మున్సిపాలిటీపరిధిలో 122కు గాను 54 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రొద్దుటూరు అర్బన్ పరిధిలో 176 మంది, మండల పరిధిలో 207 మందికి గాను 193 మంది, రాజుపాలెంలో 111 మందికి 91, పులివెందుల నియోజకవర్గం చక్రాయపేటలో 203కు 95 మంది, లింగాల మండలంలో 436 మందికి ఒకరు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. పులివెందుల మండలంలో 114కు గాను 91మంది, మున్సిపల్ పరిధిలో 322 మందికి 273, సింహాద్రిపురం మండలంలో 180 మందికి 273, తొండూరు మండలంలో 451 మందికి 313, వేంపల్లె మండలంలో 451మందికి 313, వేముల మండలంలో 154కు గాను 85 మంది మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖా స్తు చేసుకున్నారు. ఇందులో గతంలో వికలత్వపు పింఛను వచ్చే వారికి వయసురీత్యా అర్హత ఉన్న వారికి వృద్ధాప్య పింఛన్ల కిందకి మార్పు చేశారు. ఈ రకంగా జిల్లాలో 7,182 వికలత్వ పింఛన్లకు 1177 పింఛన్లను ఓఏపీ కిందికి మార్పు చేశారు. వీరందరు కూడా తమకు వికలత్వపు పింఛన్లు మంజూరు చేయాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. వృద్ధాప్య పింఛన్లు 4వేలు, వికలత్వపు పింఛన్లు 6వేలు ఇవ్వడంతో చాలా మంది వికలత్వపు పింఛన్లు కోరుకుంటున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకే నిర్ణయం



ప్రభుత్వ ఆదేశాల వికలత్వపు పింఛన్లు కోల్పోయిన వారు తిరిగి అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పించాం.. ఆ విధంగా అప్పీలు చేసుకున్న వారికి తిరిగి వారి వికలత్వపు శాతం నిర్ధారణ అయ్యేంత వరకు వికలాంగుల పింఛన్లే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అదే విధంగా వికలత్వపు పింఛను నుంచి వృద్ధాప్య పింఛన్లు పొందిన వారు కూడా తమకు వికలత్వపు పింఛన్లనే అమలు చేయాలంటూ దరఖాస్తులు చేసుకుంటున్నారు. వికలత్వపు పర్సంటేజీ పునః పరిశీలనలో వచ్చేశాతం బట్టి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటాం.

-డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, పీడీ, డీఆర్‌డీఏ

తేనెలొలుకు భాష తెలుగు

● పాఠ్యపుస్తక ప్రచురణల రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్‌రావు



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మధుసూదన్‌రావు, షంషుద్దీన్, సుబ్రహ్మణ్యం తదితరులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తేనెలొలుకు భాష తెలుగు భాష అని పాఠ్యపుస్తకాల ప్రచురణాల రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్‌రావు తెలిపారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని యూటీఎఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో పాఠ్యపుస్తక ప్రచురణల రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు. గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవహారిక భాషోద్యమానికి గిడుగు నాంది పలికారని, వాడుక భాష రాత భాషగా ఉండాలని పరితపించిన మహానుభావుడు గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు అన్నారు. కడప, అన్నమయ్య జిల్లాల డీఈఓలు డాక్టర్ షేక్ షంషుద్దీన్, డాక్టర్ సుబ్రహ్మణ్యం మాటాడుతూ మాతృభాష మాధుర్యం ఎనలేనిదని, ఉగ్గుపాలతో నేర్చుకున్న భాష ఎంతో ఉన్నతమైందని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మహేష్‌బాబు, నరసింహరావు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

ఆటో దొంగతనం కేసులో నిందితుడు అరెస్టు

కడప క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆటోను దొంగతనం కేసులో నిందితుని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. వివరాలిలా.. కడప సిటీ ఎన్జీవో కాలనీకి చెందిన తుమ్మలూరు అనిల్ కుమార్ అనే వ్యక్తిపై గతంలో ఏడు క్రిమినల్ కేసులు వివిధ పోలీసు స్టేషన్లలో నమోదయ్యాయి. చిన్నచౌకు పీఎస్, రైల్వేకోడూరు, తిరుపతి వెస్ట్, ఈస్ట్ పీఎస్‌లలో పలు ఆటోలు దొంగతనం చేసినట్లు కేసులు ఉన్నాయి. అలాగే చెన్నూరు పీఎస్, కడప వన్‌టౌన్ పీఎస్‌లో కూడా పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. ఆ మేరకు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం చిన్నచౌకు ఇన్‌స్పెక్టరు ఓబులేసు, సబ్ ఇన్‌స్పెక్టరు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్, సిబ్బందితో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి శుక్రవారం తాడిపత్రి- తిరుపతి బైపాస్ రోడ్డులోని చలమారెడ్డిపల్లె క్రాస్‌రోడ్డు వద్ద నింది తుని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

సన్‌సైడ్ విరిగిపడి ఆరుగురికి గాయాలు



జమ్మలమడుగు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికోట కొట్టాలపల్లెలో సన్‌సైడ్‌విరిగి పడి ఆరుగురికి గాయాలయ్యాయి. గ్రామస్థుల వివరాల మేరకు... శుక్రవారం సాయంత్రం వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తుండగా మిద్దెపై కొందరు నిలబడి చూస్తున్నారు. ఆ సమయంలో ఉన్నట్లుండి సన్‌సైడ్ విరిగి కింద ఉన్న వారిపై పడటంతో గాయపడ్డారు. వెంటనే వారిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో వై.లక్ష్మీదేవి, పద్మావతి, వరలక్ష్మి, పూజారి లక్ష్మీదేవి, మైల గురుకుమార్, ఎం.గురివిరెడ్డితో పాటు మరి కొందరు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మేకల కాపరి మృతి

సీకేదిన్నె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలో మద్దిమడుగు సుగాలిబిడికివద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బుక్కే నాగయ్యనాయక్ (55) మృతి చెందాడు. సుగాలిబిడికి చెందిన బుక్కే నాగయ్యనాయక్, ఓబుళమ్మ భార్యభర్తలు మేకలు మేపుకుని జీవిస్తుండేవారు. శుక్రవారం మేకలను మేపుకునేందుకు గువ్వల చెరువు ఘాట్‌పైకి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి తోలుకుని వస్తుండగా బిడికి సమీపంలో కడపవైపు నుంచి రాయచోటివైపు వెళ్లే ట్రాన్స్‌పోర్టు లారీ ఢీకొనడంతో భార్యాభర్తలు కిందపడిపోయారు. దీంతో అటువైపు వెళ్లే ప్రయాణికులు వారిని గుర్తించి చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించగా నాగయ్యనాయక్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఓబులమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వారి బంధువులు తెలిపారు. ఘటనపై సీకేదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కలసపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధమూర్తిపల్లె వద్ద శుక్రవారం సాయంత్రం పొలం నుంచి ఇంటికి వెళ్తున్న మహిళ మెడలోని సరడును గుర్తు తెలియని యువకుడు లాక్కెళ్లాడు. గ్రామానికి చెందిన పి.మల్లేశ్వరి కలసపాడు-పోరుమామిళ్ల ప్రధాన రహదారిలోని తనపొలం వద్ద పనులు చేసుకొని తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటన స్థలాన్ని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ పరిశీలించి మహిళ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చదువు రానివారికి చదువు నేర్పించండి

● వయోజన విద్యా డీడీ వెంకటసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వయోజన విద్యాశాఖ డీడీ వెంకటసుబ్బారెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చదువురానివారికి చదువు నేర్పిస్తే.. వారికి మీరు ఎప్పటికీ గుర్తుండిపోతారని వయోజన విద్యాశాఖ డీడీ వెంకటసుబ్బారెడ్డి వలంటీర్లకు సూచించారు. జమ్మలమడుగు మెప్మా కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఉల్లాస్- అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వయోజన విద్యాశాఖ, మెప్మా ఆధ్వర్యంలో రీసోర్స్ పర్సన్లు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చదువు చాలా అవసరమన్నారు. ముఖ్యంగా మహిళలకు చదువు ఉంటే ఎదుటివారితో గౌరవంతో మాట్లాడమే కాక ధైర్యంతో పనులు విజయవంతంగా చేసుకువస్తారన్నారు. అనంతరం చదువు నేర్పించిన వలంటీర్లకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందిస్తారన్నారు. సూపర్‌వైజర్ మహేశ్వర్‌రెడ్డి, మెప్మా అధికారి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వీఏవోలకు, సీసీలకు, ఉపాధి హామీ పథకంలోని టీఏ, పీఏలకు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 18 నుంచి 59 సంవత్సరాలలోపు చదువురాని స్త్రీ, పురుషులకు వలంటీర్లు చదువు నేర్పిస్తారని.. ప్రతిరోజు సాయంత్రం రోజు ఒక గంట చొప్పున చదువు నేర్చుకోవాలని వయోజన విద్యా డీడీ వెంకటసుబ్బారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో శివారెడ్డి సూచించారు. ఏపీఎం గురుకుమార్, ఉపాధి హామీ ఏపీవో పద్మారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, సునీత పాల్గొన్నారు.

కన్నుల పండువగా ఆరోగ్యమాత తిరునాళ్ల పతాకావిష్కరణ



మేరీమాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న క్రైస్తవ విశ్వాసులు

కడప కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నగర రైల్వేస్టేషన్ సమీపంలో గల ఆరోగ్యమాత తిరునాళ్ల మహోత్సవాల పతాకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప పీఠాధిపతి సగినాల పాల్ ప్రకాష్ హాజరై పతాకావిష్కరణ గావించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విశ్వాసులు హాజరై ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం మేరీమాత విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఊరేగింపు నిర్వహించారు. తదుపరి శాంతి కోసం శాంతి కపోతాన్ని (పావురం) ఎగురవేశారు. అనంతరం దివ్య పూజా సమర్పించారు. తిరునాళ్ల మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరగాలని, ప్రజలందరూ శాంతి సమాధానాలతో వుండాలని ప్రార్థించారు.

దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు

కాశినాయన ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అక్కంపేట గ్రామంలో మురుకూటి పెంచల్‌రెడ్డిపై దాడికి పాల్పడిన ఐదుగురిపై శుక్రవారం కేసునమోదు చేసినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఆయన వివరాల మేరకు... పెంచల్‌రెడ్డి తన సొంత పొలంలో సేద్యం చేసుకునేందుకు వెళుతుండగా అదేగ్రామానికి చెందిన మురుకూటి వెంకటసుబ్బారెడ్డి, చిన్నసుబ్బిరెడ్డి, రామాంజలి, నాగవేణి సుబ్బారెడ్డి తల్లి సీతమ్మ కలిసి అడ్డుకోవడంతో పాటు పెంచల్‌రెడ్డిని అసభ్య పద జాలంతో దూషించి దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

నేటి నుంచి కడపలో సౌత్‌జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-23 మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 30వ తేదీ శని వారం నుంచి ఏసీఏ సౌత్‌జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-23 మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఇందులో కర్నూలు, నెల్లూరు, కడప, చిత్తూరు, అనంత పురం జిల్లాల క్రికెట్ జట్ల మధ్య క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు- నెల్లూరు జట్ల మధ్య, కేవోఆర్ఎం మైదానంలో కడప-చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు. సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-కర్నూలు, కేవోఆర్ఎం మైదానంలో అనంత పురం-నెల్లూరు జట్ల మధ్య పోటీలు వుంటాయన్నారు. సెప్టెంబ ర్ 7 నుంచి 9వ తేదీ వరకు ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-చిత్తూరు, కేవోఆర్ ఎం మైదానంలో కడప-నెల్లూరు జట్ల మధ్య పోటీలు జరుతాయన్నారు. సెప్టెంబర్ 11 నుంచి 13వ తేదీ వరకు ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు-నెల్లూరు, కేవోఆర్ఎం మైదానంలో అనంతపురం-కర్నూలు జట్ల మధ్య పోటీలు జరుగుతాయన్నారు. సెప్టెంబర్ 15 నుంచి 17వ తేదీ వరకు ఏసీఏ క్రికె ట్ మైదానంలో అనంతపురం-కడప, కేవోఆర్ఎం మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య పోటీలు నిర్వహిస్తున్నట్లు రెడ్డి ప్రసాద్ తెలిపారు.

ఈ పోస్ మిషన్ల ద్వారా ఎరువులు విక్రయించాలి

● వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్

కడప రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులకు ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తున్న అన్ని రకాల ఎరువులను ఈ పోస్ మిషన్ల ద్వారా క్రయ, విక్రయాలను తప్పనిసరిగా జరపాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ పేర్కొన్నా రు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ సమావేశ కార్యాలయంలో రైతు సేవా సిబ్బందికి ఈ పోస్ మిషన్లపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతుల అవసరాల మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నా యని... ఇక నుంచి ఈ పాస్ మిషన్ల ద్వారానే క్రయ విక్రయాలను చేపట్టాలన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 100 మంది రైతు సేవా సిబ్బందికి ఈ పోస్ మిషను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయశాఖ అధికారులు, రైతు సేవా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని ఊరేగింపులో ఉద్రిక్తత... 144 సెక్షన్ అమలు



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసుసిబ్బంది

చెన్నూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులో గురువారం రాత్రి వినాయకుడి ఊరేగింపు సందర్భంగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పోలీసులు 144 సెక్షన్ అమలు చేస్తు న్నారు. వివరాలిలా... చెన్నూరు మండల కేంద్రంలో పలు వీధుల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా స్థానిక తూర్పు హరిజనవాడలో వినాయక విగ్రహం ఏర్పాటు చేసి.. గురువారం రాత్రి ఊరేగింపు చేపట్టగా.. అదే ప్రాంతంలోని కొందరు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాలు మోహరించడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. ఈ విషయాన్ని స్థానిక సీఐ కడప డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంతో ఐదుగురు సీఐలు, పలువురు ఎస్ఐలు పెద్దఎత్తున పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు చెన్నూరు పాత బస్టాండు కూడలిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్తగా పరిస్థి తిని అదుపులో ఉంచేందుకు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తూర్పు వీధిలోకి ముగ్గురికి మించి వెళ్లకుండా పోలీసు సిబ్బంది బారికేడ్లు ఏర్పాటు చేశారు. అలాగే తూర్పు హరిజనవాడ నుంచి బస్టాండు వరకు ఎవరినీ వెళ్లనీయ కుండా ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా చెన్నూరులో వినాయకుని అన్న ప్రసాదం జరిగే ప్రాంతానికి తమను ఎందుకు వెళ్లనివ్వడం లేదంటూ తూర్పు హరిజనవాడ ప్రజలు స్థానిక సీఐ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాత్రి ఊరేగింపు సందర్భంగా గొడవకు కారణమైన షబ్బీర్, అష్రఫ్, వారిష్, ఫకృద్దీన్, షఫి, తన్వీర్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని.. ఎవరైనా గొడవలకు పాల్పడితే సహించేది లేదని.. కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సీఐలు రామక్రిష్ణ, సుబ్బారావు, రోషన్‌తో పాటు పలువురు ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

'బద్వేల్‌ను కడప జిల్లాలోనే కొనసాగించాలి'

కడపసెవెన్ రోడ్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బద్వేల్ నియోకవర్గాన్ని కడప జిల్లాలో కొనసాగించాలని జిల్లా పరిషత్ జనరల్ బాడీ సమావేశంలో తీర్మాణం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ గతంలో బద్వేలు నియోజకవర్గాన్ని రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో కలపడంతో భౌగోళికంగా, రవాణాపరంగా ఇబ్బందులు నెలకొంటున్నాయని, మధ్యలో నియోజకవర్గంలోని కలసపాడు మండలం ప్రజలు రాజంపేటకు పోవాలంటే 150కిలోమీటర్లు పైబడి పోవాల్సి వస్తుందన్నారు. రాత్రి 9 దాటితే అట్లూరు సిద్దవటం రాకపోకలు నిలిపివేస్తే మైదుకూరు మీదుగా కడప నుంచి రాజంపేటకు పోవాల్సి వస్తుందని ఇది అన్ని విధాలా పరిపాలన పరమైన అవరోధాలు తప్ప అనుకూలం కాదన్నారు. కడప జిల్లాలో బద్వేల్‌ను కొనసాగించాలనే అంశంపై సీపీఐ ప్రత్యక్ష పోరాటానికి శ్రీకారం చుడుతుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, సహాయ కార్యదర్శి జి.మద్దిలేటి పాల్గొన్నారు.

అనాథ వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

కడప(వినాయకనగర్), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే మాధవి జన్మదినం సందర్భంగా కడప సబ్ జైలు సమీపంలో ఉన్న శ్రీచౌడమ్మ వృద్ధాశ్రమంలో శుక్రవారం కడప 9వ డివిజన్ టీడీపీ నాయకుడు, శ్రీసాయి యువజన సేవా సంఘం చైర్మెన్ మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ కార్యక్రమం, కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎంవీ కృష్ణారెడ్డి, తాడిపత్రి గంగాధర్, ఆనంద్‌బాబు, శివ, భాస్కర్‌రెడ్డి, కొండాయపల్లె ప్రసాద్‌నాయుడు, శ్రీచౌడమ్మ వృద్ధాశ్రమం నిర్వాహకుడు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా శశిభూషణ్‌రెడ్డి



కడప మారుతీనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధికారప్రతినిధిగా వంగళ శశిభూషణ్‌రెడ్డి నియమితుల య్యారు. ఆ మేరకు శశిభూషణ్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీ.ఎన్. మాధవ్ ఎంపిక చేశారు. ఆ మేరకు విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వంగళ శశిభూషణ్‌రెడ్డికి మాధవ్ స్వీటు తినిపించి ఆనందం పంచుకున్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను త్రికరణశుద్ధిగా నిర్వహించి పార్టీ బలోపేతానికి అవిరళ కృషి చేస్తానని స్పష్టం చేశారు.

టీడీపీ నేతకు నివాళులర్పించిన ఎమ్మెల్యే



పెండ్లిమర్రి, ఆగస్టు 29 (ఆంధ్ర జ్యోతి):మాచునూరు పంచాయతీ ఆరవేటిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నేత ఆరవేటి శ్రీనివాసుల రెడ్డి(37) శుక్రవారం మృతి చెందా డు.విషయం తెలుసుకున్న ఎమ్మె ల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ఆయన స్వగ్రామానికి వెళ్లి పూలమాల వేసి నివాళుల ర్పించారు.టీడీపీ నేతలు పుత్తా రామాంజులరెడ్డి,పుత్తా యోగాంజులరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి,విష్ణువర్ధన్‌రెడ్డి, నాగరాజారెడ్డి, బ్రహ్మయ్య,రాజారెడ్డి,రాజశేఖర్,అంకిరెడ్డి నివాళులర్పించారు.

సర్వజన ఆమోదయోగ్యం సలీమ్ కవిత్వం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కడప కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తన చుట్టూ ఉన్న సమాజాన్ని మానవ సంబంధాలను తన హృదయంలో సంలీనం చేసుకుని సలీమ్ సర్వజన ఆమోదయోగ్యంగా కవితలల్లారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. తెలుగు భాష దినోత్సవం సందర్భంగా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్‌కేఆర్‌అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేమల సలీమ్ బాష కవిత్వీకరించిన సమీచీనం కవితా సంపుటి పుస్తక పరిచయ సభను నిర్వహించారు. మొదట గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు డాక్టర్ జి. రవీంద్రనాథ్, జి.ఎల్. లావణ్య, తవ్వా వెంకటయ్య, ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతాచర్యలు పటిష్టం చేయాలి : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు మరింత పటిష్టం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శుక్ర వారం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా క్రైసిస్ గ్రూపు కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ కల్పించేందుకు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఏపీఎస్పీడీఎల్, ఐఓసీఎల్, సిమెంట్ పరిశ్రమల ప్రతి నిధులు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బిజినెస్ రీఫార్మ్ సర్వేలో పాల్గొనండి..: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బిజినెస్ రీఫార్మ్ సర్వేలో జిల్లాలోని సంబంధిత శాఖల నుంచి సేవలందుకున్న ప్రతినిధులు పాల్గొనేలాగా చూడాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా స్థాయి ఔట్ రీచ్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈకార్యక్రమం లో రాష్ట్ర ఇండస్ట్రీ కన్సల్టెంట్ అసిస్టెంట్ మేనేజరు రవితేజ,పరిశ్రమలు, పొల్యూషన్ బోర్డు అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గణేశ్ నిమజ్జనం

కడప రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం గణేశ్ నిమజ్జనం వేడుకలను ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం 15 ఆడుగులు వరసిద్ధి వినాయక విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి, జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తర్వాత విగ్రహాన్ని ఊరేగింపుగా డప్పువాయిద్యాల మధ్య నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమాల్లో ఏపీపీఆర్ ఎంఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. నాగిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకా మల్లేశ్వరరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఏవోలు భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, జడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా బాలాజీనగర్‌లోని వినాయక మండపం వద్ద డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ పుత్తా వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం శ్రీనివాసులు, నాగభూషణం, ఉత్తమా రెడ్డి, ఆర్‌సీ ఓబులరెడ్డి, సృజన్, మధు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల అన్నప్రసాద వితరణ

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కడపలోని నాగరాజుపేటలో వినాయకుడు విగ్రహం వద్ద వికాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సుల్తాన్‌బాబా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవి, నారాయణ, హర్ష, నాని, మహేష్ , మహిళలు తదితరులు నిర్వాహకులు పాల్గొన్నారు.

● **23వ డివిజన్ నాగరాజుపేట రాజీవ్‌నగర్‌లో..:** కడప నగరంలోని 23వ డివిజన్ నాగరాజుపేట రాజీవ్‌నగర్‌లో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరి ప్రసాద్ అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో బాల వెంకటసుబ్బయ్య బాబు,రమణ, దండు అశోక్ పాల్గొన్నారు.

లింగాల..: మండల వ్యాప్తంగా శుక్రవారం వినాయకుని నిమజ్జనం కార్యక్రమాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. లింగాల,పార్నపల్లె, కోమన్నూతల, ఎగువపల్లె, దిగువపల్లె, తదితర గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాన్ని ప్రజలు ఉత్సాహంగా డప్పు వాయిద్యాలతో చిందులు వేస్తూ నిర్వహించారు. మొత్తం 80చోట్ల వినాయక విగ్రహ ప్రతిమలు ఏర్పాటుచేయగా శుక్రవారం వరకు సుమారు 50వినాయక ప్రతిమలకు సంబంధించి నిమజ్జనం కార్యక్రమాలు పూర్తయ్యాయి.

పులివెందుల..: పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ నిమజ్జన ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. పులివెందుల, తొండూరు తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన గణనాథుల ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు పోలీసులు తొండూరు వద్దనున్న రాజసేతు సాగర్ వద్ద ఏర్పాట్లుచేశారు. అలాగే శుక్రవారం ఉదయం రూరల్ సీఐ ఎస్వీ రమణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తొండూరు ఎస్ఐ ఘనమద్దిలేటి, పీఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు..: వినాయకచవితి సందర్భంగా చెన్నూరు శివాలయం వీధిలో కొలువై ఉన్న వినాయకున్ని శుక్రవారం సాయంత్రం ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాటాలు, యువకుల నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం పెన్నానదిలో నిమజ్జనం చేశారు. కాగా ఊరేగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కడప డీఎస్పీ, స్థానిక సీఐ ఆధ్వర్యంలో పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే పలు వీధుల్లో అన్నదానం చేశారు. కాగా కొండపేటకుచెందిన మాజీ సర్పంచ్ మన్నెంమోహన్‌రెడ్డి వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన లడ్డూను రూ.36వేలకు వేలం పాట పాడి దక్కించుకున్నారు.

పెండ్లిమర్రి..: మండల పరిధిలోని అన్ని గ్రామాలలో శుక్రవారం గణనాథుల ఊరేగింపు కన్నుల పండుగలా జరుపుకున్నారు. ప్రతి గ్రామంలో బ్యాండు,లౌడ్‌స్పీకర్స్,బాణ సంచా పేలుళ్ల నడుమ వినాయక ప్రతిమలు నిమజ్జనానికి బయలు దేరాయి. నల్లయ్యగారిపల్లె గ్రామంలో రూ.20,000లకు లడ్డూను వేలం పాటలో ధనుంజయరెడ్డి దక్కించుకున్నారు.

సింహాద్రిపురం..: మండలంలో కొలువు తీరిన వినాయక ప్రతిమలను శుక్రవారం అంగరంగవైభవంగా నిమజ్జన చేశారు. సింహాద్రిపురం పుర వీధులలో బాజా భజంత్రీలు, డప్పు వాయిద్యాల మధ్య వినాయక ప్రతిమలను ట్రాక్టర్లపై ఊరేగింపుగా తీసుకెళ్లారు.

వీరపునాయునిపల్లె..: మండలంలోని పలు గ్రామాలలో వినాయక చవితి పండుగ పురస్కరించుకొని శుక్రవారం గణనాథుల నిమజ్జనం జరిగింది.ఎన్.పాలగిరి క్రాస్ వద్ద మొగమోరు వాగులో గణేష్ ప్రతిమలను నిమజ్జనం చేశారు.

పోటాపోటీగా వేలం పాటలు..: మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో శుక్రవారం వినాయక మండపాలవద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. నడివీధి గంగమ్మ వద్ద ఏర్పాటుచేసిన వినాయకుని మండపం వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించగా వీరపునాయునిపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు నర్రెడ్డి అరుణ్ కుమార్‌రెడ్డి రూ.2.35లక్షలకు దక్కించుకున్నారు. అలాగే బోగాదమ్మ ఆలయ ప్రాంగణం వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఒంటిగారి సుధీర్ రూ.40వేలకు దక్కించుకున్నారు. అలాగే మారుతీనగర్ వద్ద లడ్డూను కోళ్లఫారం భాస్కర్‌రెడ్డి రూ.60 వేలు ,ఎస్ఆర్‌పేట కాలనీలో కృష్ణమోహన్‌రెడ్డి రూ.31వేలకు దక్కించుకున్నారు. అనిమెల రోడ్డులో ఏర్పాటుచేసిన లడ్డూను గోపి రూ.27,100 లడ్డను దక్కించుకున్నారు.

వల్లూరు..: మండల ంలోని పలు గ్రామాల్లో గణేశుని నిమజ్జనం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెద్దపుత్త, పెద్దపుత్త ఎస్సీకాలనీ, దుగ్గాయపల్లె, మిట్టపల్లె, వెంకటేశాపురం, తోళ్లగంగనపల్లె, ఆది నిమ్మాయపల్లె. ఎ.ఓబాయపల్లె, కోట్లూరు, అంబవరం, నల్లపురెడ్డిపల్లె, దిగువపల్లె ఇంకా తదితర గ్రామాల్లో మూడురోజులుగా వినాయకునికి పూజలు చేసి అన్నదానం చేశారు. లడ్డూ, చెరుకు గడనువేలం పాట నిర్వహించారు. అనంతరం ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట, గోటూరు వంక వద్ద, ఆలంఖాన్‌పల్లె వద్ద గల కేసీ కెనాల్, కమలాపురంమండల పరిధిలోని కుందూనదిలో నిమజ్జనాలు చేశారు. ఎస్ఐ పెద్ద ఓబన్న ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కమలాపురం రూరల్..: మండల పరిధిలోని గ్రామాల్లో పట్టణంలోని వినాయకచవితి సందర్భంగా నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐ రోషన్, ఎస్ఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా కుందూనదిలో ఏటూరు వద్ద నిమజ్జనం చేశారు. కాగా మండలంలోని జె.కొత్తపల్లె గ్రామంలో గణేశుడికి సమర్పించిన లడ్డూను రూ.25500కు అదే గ్రామానికి చెందిన కర్నాటి రాంప్రసాద్‌రెడ్డి దక్కించుకున్నారు.





లింగాల... గ్రామోత్సవంలో చిందులు వేస్తున్న యువత, సింహాద్రిపురంలో మహిళల కోలాటం మధ్య నిమజ్జనానికి వెళుతున్న గణనాథుడు



చెన్నూరులో యువకుల ఆనందోత్సాహాలు



పులివెందులలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీనాయక్



పెండ్లిమర్రి...నల్లయ్యగారిపల్లె గ్రామంలో లడ్డూ విజేత



వీరపునాయునిపల్లె.. లడ్డూను దక్కించుకున్న నర్రెడ్డి అరుణ్‌కుమార్‌రెడ్డి







కడప..అన్నదానం చేస్తున్న జడ్పీ ఛైర్మన్ రామగోవిందరెడ్డి, సీఈవో ఓబులమ్మ, అన్నదాన కార్యక్రమంలో వికాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సుల్తాన్ బాబా, 23వ డివిజన్‌లో హరిప్రసాద్

బాల్యవివాహాలు చట్టపరంగా నేరం

కడప రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాలు చట్టపరంగా నేరమని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ తెలిపారు. శుక్రవారం కడప నగరం చిన్నచౌక్‌లోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో బాల్యవివాహాలు, చిన్నవయస్సులో గర్భధారణ తదితర అంశాలపై అవగాహన ప్రచారం చేపట్టారు. మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 181, న్యాయసహాయం కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ నెంబర్ 14456పై వివరించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ట్రైబల్ అండ్ ఎంపవర్మెంట్ ఆఫీసర్ సరస్వతి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఆర్. సుభాష్ యాదవ్, ఎస్. శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

● **ఖైదీల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి :** మానసిక వ్యాధులతో బాధపడే ఖైదీల ఆరోగ్య విషయాలపట్ల శ్రద్ధ వహించాలని జడ్జి బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం పురుషులు, మహిళల కేంద్రకారాగాలను తనిఖీ చేశారు.

ఘనంగా గురివిరెడ్డి స్వామి ఆరాధనోత్సవం

వేంపల్లె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తలూరు పంచాయతీ పరిధిలోని తాటిమాకులపల్లెలో యోగానంద గురివిరెడ్డి స్వామి ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి, కాంబల్లె మాజీ సర్పంచు ఉమాదేవి తదితరులు గురివిరెడ్డి స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎద్దులతో బండలాగుడు పోటీలను తులసిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఉమాదేవి చేతులమీదుగా నగదు బహుమతులను పంపిణీ చేశారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

పెండ్లిమర్రి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శుక్రవారం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి తనిఖీ చేశారు. డాక్టరుతో పలు విషయాలపై చర్చించి తగు సూచనలు,సలహాలు ఇచ్చారు.ఆసుపత్రికి నీటి సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ,మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగినమత్తులో కారు అద్దాలు ధ్వంసం

పులివెందుల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామ సమీపంలో తాగిన మత్తులో కారు అద్దాలు ధ్వంసం చేసిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎస్ఐ విష్ణు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం నల్లపురెడ్డిపల్లెలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు జరుగుతోంది. ఈ సమయంలో ప్రొద్దుటూరు శ్రీరామ్‌నగర్‌కు చెందిన వీరభద్రయ్య అనే వ్యక్తి మరో ఇద్దరితో కలిసి పావగడకు వెళ్తున్నారు. నల్లపురెడ్డిపల్లె గ్రామాన్ని దాటుకోగానే ఇద్దరు యువకులు బైకుపై వచ్చి కారును ఢీకొట్టారు. దీంతో కారు డ్రైవర్ ప్రశ్నించగా ఇద్దరు యువకులు గొడవపడి మరికొందరికి ఫోన్ చేసి రప్పించుకుని కారుపై దాడి చేసి అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో కారులో ఉన్నవారు భయపడి దిగి వెళ్లిపోయారు. ఈ సంఘటనపై ఆరు గురితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా కారు అద్దాలను ధ్వంసం చేసిన వారు తాగినమత్తులో ఉన్నట్లు పలువురు చెబుతున్నారు.

గంగ ఒడిలోకి గణపయ్య

కడప కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా మూడు రోజులుగా మండపాలలో కొలువుదీరిన బొజ్జ గణపయ్య భక్తుల పూజలందుకున్నారు. ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన నిమజ్జనం శుక్రవారం ప్రారంభమైంది. జిల్లా అంతటా దాదాపు 1,600 విగ్రహాలు గంగఒడికి చేరాయి. ప్రత్యేకంగా చెరువులు, కాల్వలు, బావులలో స్వామివారి విగ్రహాలను వేసేలా ప్రభుత్వ యంత్రాంగం ఆదేశాలిచ్చింది. అందుకు తగ్గట్టుగా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు నిర్వహించింది. పాత కడపచెరువుతో పాటుగా బిల్టప్ వద్ద, ఫాతిమా కాలేజీవద్ద, ఇర్కాన్ సర్కిల్ వద్ద కాల్వలో, బచ్చుంపల్లె చెరువు తదితర ప్రాంతాలలో గణేశుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. గణపయ్య విగ్రహాలను ట్రాక్టర్ల ద్వారా కోలాహలంగా వాయిద్యాలు, డప్పుల దరువుల మధ్య డ్యాన్స్‌లేసుకుంటూ తీసుకొచ్చి నిమజ్జనం గావించారు. చెరువులో బోట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. క్రేన్ సాయంతో పెద్ద విగ్రహాలను చెరువులోకి మెల్లగా దింపేసి నిమజ్జనం సజావుగా పూర్తి చేశారు. కాగా మరికొన్ని విగ్రహాలు ఐదవరోజైన ఆదివారం, మరికొన్ని తొమ్మిదవ రోజున నిమజ్జనం కానున్నాయి.







ఐటీఐ సర్కిల్ నుంచి కోలాటంతో గణనాథుడి ఊరేగింపు

బై..బై.. గణేశా



ఖాజీపేటలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథులు

జమ్మలమడుగు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలకు కొలువుదీరి భక్తిశ్రద్ధలతో మూడు రోజులపాటు పూజలందుకున్న గణనాథులు శుక్రవారం భక్తుల కేరింతల నడుమ గంగ ఒడి చేరుకున్నారు. జమ్మలమడుగులో ఉత్సవ కమిటీలవారు అంగరంగ వైభవంగా రంగులు చల్లుకుంటూ నిమజ్జనానికి విగ్రహాలను తరలించారు. మరికొందరు వినాయక విగ్రహాల వెంట మేళాలతో కోలాటం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడ ఎలాంటి ఘటనలు జరుగకుండా డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అర్బన్ సీఐ నరేష్‌బాబు, వారి సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ప్రొద్దుటూరు టౌన్‌లో: వినాయక చవితి పండుగను పురష్కరించుకుని వీధి వీధిన కొలువు తీరిన గణనాథులు భక్తులతో పూజలు అందుకుంటున్నారు. కొన్ని వినాయకవిగ్రహాల వద్ద మధ్యాహ్న సమయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మరికొన్ని వినాయక విగ్రహాల వద్ద చిన్నారులకు క్విజ్ పోటీలు, భక్తిగీతాల పోటీలు, మహిళలకు ముగ్గులు, కోలాటం పోటీలు నిర్వహించారు. స్థానిక శ్రీరాములపేట ఏసీఎస్ కార్యాలయం వెనుకవైపు చాకెట్లతో ఏర్పాటు చేసిన గణనాథుడు ఆకట్టుకుంటున్నాడు. పీడబ్ల్యూ కార్యాలయం వద్ద నాలుగు చేతులతో వినాయక విగ్రహాలను, వైఎంఆర్ కాలనీ అరవిందాశ్రమంలో అశ్వవాహనంపై గణనాథుడు, సరస్వతి విద్యామందిరం రోడ్డులో సిద్ధి, బుద్ధిలతో వినాయక విగ్రహం ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. కాగా పట్టణంలో కొన్ని విగ్రహాలను కామనూరులోని కుందూ నదిలో నిమజ్జనానికి తరలించారు. బొల్లవరం బాకరాపేటలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని కుందూ నదిలో నిమజ్జనం చేశారు.

నిమజ్జనం వద్ద ఉచిత వైద్యశిబిరం

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని కామనూరు వద్ద ప్రవహిస్తున్న కుందూ నది వంతెనపై వైద్య సిబ్బంది ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐ కె.రాజు పర్యవేక్షణలో అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బంది అన్ని రకాల జాగ్రత్తలు చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా నేతృత్వంలో ఆప్తాల్మిక్ అధికారి తేజ, సూపర్‌వైజర్ బి.ఎ.వరప్రసాద్, సీహెచ్‌వో మెర్సీ, ఏఎన్ఎంలు యశోధ, హేమ, ఝాన్సీ, ఆశా కార్యకర్తలు బిందు, ప్రభావతి పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్‌లో: మైదుకూరు పట్టణంలో గణేశ్ విగ్రహాల నిమజ్జనం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వినా యక విగ్రహాలను అల్లడుపల్లె సమీపంలోని కుందూ నదిలో నిమజ్జనం చేశారు..భక్తులు విగ్రహాల వెంట బాణసంచా కాల్చుతూ, రంగులు చల్లుకొంటూ, బ్యాండ్ బాజాల మధ్య గణనాథుల నిమజ్జనం కుందూ నదిలో చేశారు. డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సీఐ రమణారెడ్డి, ఎస్ఐలు చిరంజీవి, సుబ్బారావులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.గణపతి మహోత్సవ కమిటీ అధ్యక్షుడు న్యాయవాది కామనూరు శ్రీనివాసులు, ఆర్ఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెద్దముడియంలో: మండలంలో వినాయక నిమజ్జన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. మండలంలో సుమారు 80 వినాయక విగ్రహాలను మండపాల్లో మూడు రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు శుక్రవారం బాణసంచా పేలుస్తూ రంగులు చల్లుకుంటూ ఘనంగా వీడ్కోలు పలికారు. మండలంలోని నెమళ్లదిన్నె వంతెన, పెద్దముడియం వంతెన వద్ద నిమజ్జనం చేశారు. జమ్మలమడుగు, మైలవరం, ఇతర మండలా లకు చెందిన విగ్రహాలు పెద్దముడియం కుందూలో నిమజ్జనం చేశారు. పెద్దముడియం బ్రిడ్జి వద్ద రూరల్ సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ సుబ్బా రావులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దారు బాలనరసింహ, రెవెన్యూ సిబ్బం ది ఏర్పాట్లను పర్యవేక్షించారు. అగ్నిమాపక , వైద్య శాఖ సిబ్బంది అవసరమైన ఏర్పాట్లు చేశారు.

కలసపాడులో: మండలంలో శుక్రవారం వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మూడవ రోజు మడల పరిధిలోని చెన్నారెడ్డిపల్లె, బ్రాహ్మణపల్లె, చెన్నుపల్లె, ముద్దంవారిపల్లె, ముదిరెడ్డిపల్లె, అక్కిసిద్దుపల్లె గ్రామాలతో పాటు మండల పరిధిలోని దాదాపు 20చోట్ల నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. ఆయా మండపాల వద్ద లడ్డు,కలశం, చెరకుగడ వేలం పాటలు నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి గొడవలు జరగకుండా కలసపాడు ఎస్ఐ తిమోతి ఆధ్వర్యంలో పోలీసులు అన్నిచోట్ల బందోబస్తు ఏర్పాటుచేశారు.

మైలవరంలో: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో భక్తులు వైభవంగా నిర్వహించారు. మండపం నుంచి ఊరేగింపుగా గ్రామంలో రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ చిన్నారుల కేరింతలతో కోలాహలంగా ట్రాక్టర్లలో, ఆటోలలో, వినాయకులను నిమజ్జనానికి తరలి వెళ్లారు. ముందుగా వినాయకునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదానాలు నిర్వహించారు.

కొండాపురంలో: మండలంలో గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని పలు గ్రామాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాల మధ్య ,రంగులు చల్లుకుంటూ, బాణసంచా పేల్చుతూ వినాయకుని పురవీధుల్లో ఊరేగిస్తూ నిమజ్జనానికి తీసుకెళ్లారు. పలు చోట్ల అన్నదానం నిర్వహించారు. పలు వినాయక విగ్రహాల వద్ద లడ్డూ వేలంపాట నిర్వహించారు. అనంతరం గండికోట బ్యాక్‌వాటర్‌లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పోరుమామిళ్లలో: పోరుమామిళ్లలో గణేశ్ నిమజ్జనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోరుమామిళ్లలో 9 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. మండలంలో శుక్రవారం 53 గణనాథుని విగ్రహాలు నిమజ్జనం చేశారు. ఈసందర్భంగిగా యువకుఉలు రంగులు చల్లుకుంటూ జై గణేశా అని ఇనాదాలు చేసి మల్లకతవ వరకు ఊరేగింపుగా విగ్రహాలు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంచనీ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కొండారెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యనమల సుధాకర్, రెవెన్యూ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. పోరుమామిళ్ల ఆర్‌అండ్‌బీ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం వద్ద తోటోత్సవం చేశారు. సూపర్‌మార్కెట్ వీధిలో ఉన్న గణనాథుని విగ్రహం లడ్డును రూ.40 వేలకు పాట పాడి భక్తులు దక్కించుకున్నారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనం

ఖాజీపేటలో: మండల పరిధిలో దాదాపు 30 వినాయక విగ్రహాలను మూడు రోజులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి శుక్రవారం నిమజ్జనం చేశారు. మంగళవాయిద్యాలతో, బాణసంచా పేల్చుతూ మహిళలు, పిల్లలు, పెద్దలు రంగులు చల్లుకుంటూ గణేశ్ నిమజ్జనాన్ని సాగించారు. ఏటూరులో 11 కేజీల లడ్డూ రూ.85 వేలు మూలప్రతాప్‌రెడ్డి, రూ.5 బిల్ల పాటలో రూ.25 వేలు మూల భాస్కర్‌రెడ్డి, నంది పాడులో లడ్డూ రూ.16,500 సుబ్బరాయుడు దక్కించుకున్నారు. సీతానగరంలో లడ్డూ రూ.26 వేలు చిన్నసీతాలు, కలశం రూ.5 వేలు సుబ్బరాయుడు, బీసీ కాలనీలో లడ్డూ రూ.15 వేలు రాజోలి చెన్నారెడ్డి, టీచర్స్ కాలనీలో రూ.4 వేలు సూర్యనారాయణ వేలంలో దక్కించుకున్నారు.

బ్రహ్మంగారిమఠంలో: బ్రహ్మంగారిమఠం మండలంలోని సోమిరెడ్డిపలెలో వెలసియున్న వినాయకునికి సింగిల్‌విండో చైర్మన్ వెల్లటూరు సాంబశివారెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. లడ్డు వేలం పాటలో పెద్దసుబ్బిరెడ్డి రూ.56వేలకు దక్కించుకున్నారు. ధనమాలను రూ.27వేలకు చవ్వా సుబ్బిరెడ్డి, బ్రహ్మంసాగర్‌లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

కాశినాయనలో: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా 3వ రోజైన శుక్రవారం పిట్టిగుంట, గొంటువారిపల్లె, వరికుంట్ల ,ఆకులనారాయణ పల్లె తదితర గ్రామాల్లో గణపతి నిమజ్జనం ఆనందోత్సాహాల నడుమ సాగింది. యువత మహిళలు రంగులు చల్లుకుంటూ ముందుకు సాగారు. పిట్టిగుంటలో 5కేజీల స్వామి లడ్డును రూ..51000 పలుకగా అమ్మవా రి పట్టుచీర రూ.10,500, కలశం రూ.8000 ఉపలికాయి.



అట్లూరు వేమలూరు వంతెనపై నిమజ్జనం పర్యవేక్షిస్తున్న ఎస్ఐ రామక్రిష్ణ, సిబ్బంది



దువ్వూరు వద్ద కేసీకాలువలో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

బి.కోడూరులో : మండల పరిధిలో శుక్రవారం 20 గ్రామాల్లో గణనాథులను ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల్లో వినాయకుని లడ్డు పాట రూ.40వేల నుంచి రూ.55వేల వరకు పాడారు. మిగతా గ్రామాల్లో ఆదివారం నిమజ్జనం ఏర్పాట్లు చేయనున్నట్లు వినాయక కమిటీ సభ్యులు తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వెంకటసురేశ్ గట్టిబందోబస్తు నిర్వహించారు.

గోపవరంలో : మండల పరిధిలోని గ్రామాల నుంచి గణనాథుడు భక్తులచే పూజలందుకుని శుక్రవారం గంగమ్మ ఒడికి చేరుకున్నారు. శ్రీనివాసపురం వద్ద కూడలిలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం లడ్డు వేలం పాట జరగ్గా రూ.2,08,000లు సంద్ర బ్రహ్మయ్యనాయుడు చెరుకుగడ రూ.11,116లుసొంతం చేసుకున్నారు. అలాగే చిన్న గోపవరంలో గణపయ్య లడ్డు రూ.1,04,000లకు ఆవుల గురుప్రసాద్ సొంతం చేసుకున్నారు. సాయంత్రం మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ ఊరేగింపు నిర్వహించారు.

దువ్వూరులో: దువ్వూరులో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. మండల పరిధిలో వినాయక చవితిని పురష్కరించుకుని 130 విగ్రహాలను ఆయా గ్రామాల్లో నిలుపగా 60 విగ్రహాలను శుక్రవారం పలు చోట్ల నిమజ్జనం చేశారు. మండల కేంద్రంలో విగ్రహాలను ఊరేగింపుగా యువత కేరింతలు కొడుతూ రాంసాయినగర్ వద్ద కేసీ కాలువలో నిమజ్జనం చేశారు. తెలుగుగంగ జలాశయంతోపాటు దువ్వూరు చెరువులో నిమజ్జనం చేశారు. ఎస్ఐ వినోద్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

అట్లూరులో : మండలంలోని 74 మండపాల్లో వినాయకుడు కొలువుదీరగా మూడో రోజు శుక్రవారం 55 వినాయక విగ్రహాలు నిమజ్జనం చేశారు. వేమలూరు సమీపంలో సగిలేరు వంతెనపై నిమజ్జనానికి ఏర్పాటు చేయడం జరిగిందని అట్లూరు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. ఆకుతోటపల్లెలో బోవిళ్ల చిన్ననరసింహారెడ్డి లడ్డు లక్ష రూపాయలకు వేలంలో దక్కించుకున్నారు. చిన్నరాజుపల్లెలో గంగాగిరిరాజు రూ.85వేలకు వేలం పాటలో లడ్డును దక్కించుకున్నారు.

సబ్ జైలును తనిఖీ చేసిన జిల్లా అదనపు జడ్జి

ప్రొద్దుటూరు , ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు సబ్‌జైలును జిల్లా రెండవ అదనపు జడ్జి సత్యకుమారి శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె సబ్‌జైలులో రిజిష్టర్లను పరిశీలించి ఖైదీలను సమావేశపరిచి జాతీయ న్యాయసేవ అధికార సంస్థ (నల్సా) వారి 2024 పథకాలను లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైను నెంబరు 15100తో ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులపై నిరసన

పోరుమామిళ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల పట్టణంలో సరైన ప్లానింగ్ , క్వాలిటీ లేకఉండా రోడ్ల నిర్మాణం చేస్తున్నారని నిరసస్తూ శుక్రవారం గోంగూర మొక్కలతో నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు సరైన పద్ధతిలో రోడ్డు నిర్మించకపోతే ప్రజలతో రోడ్డును దిగ్బంధనం చేస్తామన్నారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ నాయకుడు ఫణిరావు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ప్రీమియంతో బీమా

రాజుపాలెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజరు హెప్సిబా మాట్లాడుతే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సాధారణ ప్రజలకు తక్కువ ప్రీమియంతో ఎక్కువ రక్షణ అందిస్తుందన్నారు. ఈపథకానికి 18 నుంచి 50 సంవత్సరాల వయసు వారు సంవత్సరానికి కేవలం రూ.436 ప్రీమియంతో సహజ మరణం, లేదా ప్రమాదవశాత్తు మరణం సంభవించినప్పుడు రూ.2లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. జీవన బీమాపథకం 18 నుంచి 70ఏళ్ల వారికి కేవలం రూ.20 ప్రీమియంతోనే ప్రమాదబీమా లేక శాశ్వత అంగవైకల్యం ద్వారా రూ.2లక్షలు లబ్ధి పొందవచ్చన్నారు. అసిస్టెంటు మేనేజరు విజయకు మార్ క్యాషియర్ శేఖర్ పాల్గొన్నారు.

మాతృభాషను మరువద్దు

మైలవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు భాష అమృతంతో నిండిన కమ్మనైన బాష అని, దానిని మరువద్దు అని ఇన్‌చార్జి హెచ్‌ఎం హరిమధుసూదన్‌రావు అన్నారు. మండల కేంద్రమైన దొమ్మరనంద్యాల జడ్పీ హైస్కూలులో శుక్రవారం తెలుగుభాష దినోత్సవాన్ని పురష్కరించుకుని తెలుగుభాషపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వేలంపాటలో వినాయక లడ్డూ రూ.2.16లక్షలు

మైదుకూరు రూరల్, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి) మైదుకూరు పట్టణంలో వినాయక విగ్రహాల వద్ద సాగిన లడ్డూ వేలం పాటలో స్థానిక శీలంనగర్ వినాయక విగ్రహం వద్ద మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర రెండు లక్షల 16 వేల రూపాయలకు దక్కించుకొన్నారు. అలాగే మండలంలోని తిప్పిరెడ్డిపల్లెలో లడ్డూ వేలం పాటలో కశెట్టి నరసింహులు రూ. ఒక లక్షా ఇరవై వేలకు దక్కించుకొన్నారు.

దువ్వూరులో: మండల కేంద్రంలోని దువ్వూరు వనం వీధిలో వినాయకుని లడ్డూ శుక్రవారం వేలంపాటలో. కోలా హరిత అనే మహిళ రూ.62 వేలకు పాడి లడ్డూను దక్కించుకున్నారు. అలాగే వినాయకుని విగ్రహం మెడలో ఉన్న నోట్ల దండను వేలం వేయగా చెన్నంశెట్టి నరేంద్ర రూ.80 వేలకు దక్కించుకున్నారు.

'ప్రతి రైతుకు యూరియా అందిస్తాం'

ఖాజీపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసిన ప్రతి రైతుకు యూరియా అందిస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విజిలెన్స్ డీసీపీవో గీతరాణి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రావులపల్లె యూరియా, డీఏపీ రైతులకు పోలీసుల సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ డీసీపీవో మాట్లాడుతూ రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉందని, వదంతులు నమ్మకుండా రైతులు పంటలు సాగు చేసుకోవాలన్నారు. మరో వారంలో రావులపల్లెకు మరో లారీ యూరియా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వంశీధర్, ఏవో నాగార్జున, ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

చాపాడులో ఎరువుల దుకాణాల తనిఖీ

చాపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులోని నాలుగు రసాయనిక ఎరువుల దుకాణాలను శుక్రవారం కడప విజిలెన్స్ సీఐ శివన్న, మైదుకూరు ఏడీఏ క్రిష్ణమూర్తి, ఏవో దేవీ పద్మలత తనిఖీ చేశారు. సృజన, ఆలిమస్తాన్, వీరభద్ర, విష్ణు ట్రేడర్స్‌లను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా ఎక్కువ రేటుకు అమ్మవద్దని ప్రతిరోజు ఎరువులు స్టాకు చూపించాలన్నారు. 5.658 క్వింటాళ్ల యూరియాకు ప్రభుత్వం నుంచి అనుమతులు రానందున ఇప్పుడే విక్రయించవద్దని డీలర్లకు చెప్పారు.

బ్రహ్మంగారి జిల్లాను ఏర్పాటు చేయాలి

బద్వేలు రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారి జిల్లా ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతూ శుక్రవారం బ్రహ్మంగారి జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు, ప్రజాసంఘాలు, విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు బ్రహ్మారెడ్డి, చంద్ర ఓబులరెడ్డిలు మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గాన్ని కడప జిల్లా నుంచి తొలగించి రాజంపేట జిల్లాలో కలుపుతున్నారన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంత ప్రజల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు నియోజకవర్గాలను కలుపుకుని బ్రహ్మంగారి జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ చైతన్య సమితి జాతీయ అధ్యక్షుడు బీసీ రమణ, ఉపాధ్యాయ సంఘం నాయకులు కావేటి రమేశ్‌యాదవ్, చంద్రశేకర్, కత్తి బ్రహ్మయ్య, బీజేపీ నాయకుల్దు సతీష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ధర్మిశెట్టి వెంకటసుబ్బయ్య, దళిత నాయకులు పిచ్చయ్య, కేశవయ్య, బీఎస్పీ కన్వీనరు గౌసపీర్, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కొండపల్లి చిన్నసుబ్బారావు, ప్రజలు పాల్గొన్నారు.

నిమజ్జనంలో యువకులకు గాయాలు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోగాదిపల్లెలో శుక్రవారం వినాయకుని నిమజ్జన కార్యక్రమంలో బాణసంచా పేలుస్తుండగా ప్రమాదవశాత్తు నలుగురు గాయపడ్డారు. ఇందులో జగదీష్, లోకేశ్, దుకేష్ అనే యువకులకు గాయాలు కాగా పాలకొండయ్య (32)కు తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. హుటాహుటిన 108 వాహనంలో వారిని బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తల్లీ, కుమారుడు మిస్సింగ్

ప్రొద్దుటూరు , ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరం కు చెందిన వరదచంగ్రాయుడు భార్య సుమిత్ర ఆమె కుమారుడు మూడేళ్ల తేజేంద్ర ఆగస్టు 25 నుంచి కనిపించడంలేదు. దీంతో చంగ్రాయుడు స్థానిక ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. చెంగ్రాయుడు బీరువాల పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

ఎల్ఆర్ఎస్ చేసుకోకుంటే ఇబ్బందులు తప్పవు



లేఅవుట్ ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్, టీపీవో

ఎర్రగుంట్ల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అవకాశం కల్పించిన లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీంను ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శేషఫణి, టీపీవో వెంకటరమణారెడ్డి కోరారు. ఈ స్కీంపై అవేట్స్ వేసిన వారితో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రగుంట్లలో ఇప్పటి వరకు ఒక్కలే అవుట్‌కు కూడా అనుమతి లేదన్నారు. సుమారు 31 లేఅవుట్లు ఉన్నాయని 2019 తరువాత వేసిన అనధికార అవేట్స్‌ను రెగ్యులర్ చేసుకునేందుకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ 2020 జీవో విడుదల చేసినందన్నారు. ఎల్ఆర్ఎస్ కింద ప్లాట్ల యజమానులు 45రోజుల్లోపు ముందుగా రూ.10వేలను చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. తరువాత ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారు ఎంత చెల్లించాల్సింది తెలియజేస్తామన్నారు.

ప్రకాష్‌నగర్ సమస్యలు పరిష్కరించండి

ఎర్రగుంట్ల, ఆంధ్రజ్యోతి 29(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మున్సిపాలిటిలోని ప్రకాష్‌నగర్‌లో నెలకొన్న సమస్యలప స్పందించాలని వైసీపీ వార్డు ఇన్‌చార్జి ప్రశాంత్ కమిషనర్‌ను కోరారు. ఈవిషయంపై గత రెండేళ్లుగా అధికారుల, పాలకుల దృష్టికి తెస్తున్నా పరిష్కరించలేదన్నారు. కమిషనర్ స్పందిస్తూ ఈ సమస్యను పరిష్కరించేందుకు ఇటీవల ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ద్వారా ముఖ్యమంత్రి మంజూరు చేసిన నిధుల్లో రూ.2.50కోట్లు డ్రైనేజీకి కొరకు ప్రతిపాదనలు పెట్టినట్లు తెలిపారు. అలాగే ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.11లక్షలు కూడా పెట్టినట్లు తెలిపారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల గడువు పొడిగింపు

పోరుమామిళ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత విద్యాసంవత్సరం గాను ప్రభుత్వ డిగ్రీకళాశాలలో అడ్మిషన్ల గడువు తేదీని సెప్టెంబరు 1వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్యేల్ డేవిడ్‌రాజ్ తెలిపారు. శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ డిగ్రీకళాశాలలో పీఎంఉషా పథకంలో 50 కొత్త కంప్యూటర్లు కళాశాలకు వచ్చాయని, వాటి ద్వారా కంప్యూటరు ల్యాబ్, అధునాతన సౌకర్యాలు అందుబాటులో ఉంటుందన్నారు. అలాగే ఐదు కోట్ల రూపాయలతో కొత్తగా 12 అధునాత న డిజిటల్ తరగతి భవనాలు ఈ సంవత్సరం నుంచే అందుబాటలోకి రానున్నాయన్నారు.

12వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

పోరుమామిళ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్ర చెన్నయ్య పేర్కొన్నారు. పోరుమామిళ్లలోని జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ప్రకటించేవారని, ఆ సాంప్రదాయాన్ని గత ప్రభుత్వం కేవలం కమిటీని నియమించి అమలు చేయలేదన్నారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కూడా ఎటువంటి చర్యలు లేవన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, కేజీబీవీ పాఠశాలలో 2005 నుంచి సుమారు 4వేల మంది టీచర్లు 3వేల మంది నాన్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారిని వారికి ఎంపీఎస్ ఇచ్చే అవకాశాలు కల్పించాలన్నారు.

కమిషనర్‌పై కోర్టుకు వెళతాం

● మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు , ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నెలనెలా జరగవలసిన మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌ను అధికార పార్టీ నేతలకోసం ఎగ్గొట్టడానికి ప్రయత్నించిన మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి హైకోర్టుకు వెళతామని మున్సిపల్ చైర్‌పర్సన్‌భీమునిపల్లె లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు బంగారురెడ్డి, ఖాజా తెలిపారు. శుక్రవారం చైర్‌పర్సన్ చాంబర్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 30న జరగవలసిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం కోసం రెండు వారాలుగా కమిషనర్‌కు సీసీ ద్వారా తెలియజేసినా ఆయన సమావేశం జరుపకుండా ఎగుర కొట్టడానికి యత్నిస్తున్నాడన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా తాను ఫోను చేసినా కమిషనర్ ఫోన్ ఎత్తడం లేదన్నారు. వాట్సాప్ మెసేజ్‌లకు స్పందించడంలేదన్నారు. ఈ నెల ఎగ్జిబిషన్ వేలం కు సంబంధించి కౌన్సిల్ ఆమోదం తీసుకోవాల్సివుందన్నారు. రెండు వారాలుగా అజెండాను రూపొందించి పట్టణంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటే కమిషనర్ నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీంతో కమిషనర్‌పై కోర్టుకు వెళతామన్నారు.


మున్సిపల్ కార్యాలయంలో శునకాలు

ప్రొద్దుటూరు , ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయాన్ని కుక్కలు ఆవాసంగా మార్చుకున్నాయి. ఏకంగా కమిషనర్ చాంబర్ ఎదుటే హాయిగా నిద్రపోతున్నా పట్టించుకునేవారులేరు. గురువారం సాయంత్రం కమిషనర్ చాంబర్‌కు ఎదురుగా ఉన్న 46 వసచివాలయంలోకి ఒక కుక్క ప్రవేశించి ఓ టేబుల్ కింద పడుకుంది. దీన్ని గమనించకుండానే సిబ్బంది తాళం వేసి వెళ్లి పోయారు. దీంతో రాత్రంతా దిక్కుతోచని ఆ శునకం సచివాలయంలో టేబుళ్లు ఎక్కి విద్యుత్ వైర్లతో పాటు కంప్యూటర్ నెట్ వైర్లు కొరికి మలమూత్రాలు విసర్జించి బీభత్సం చేసింది. ఉదయం తెరచి చూసే సమయానికి కార్యాలయం దుర్వాసన వెదజల్లడంతో సిబ్బంది శుభ్రం చేశారు. ఇప్పటికైనా కార్యాలయంలో సెక్యూరిటీ డ్యూటీలు నిర్వహించే వారు ఆయా సెక్షన్లకు తాళాలు వేసే సమయంలో క్షుణ్ణంగా పరిశీలించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

వీధి కుక్కల నుంచి కాపాడాలని వినాయకుడికి వినతి

బద్వేలు టౌన్, ఆగస్టు 29, (ఆంధ్రజ్యోతి): వీధికుక్కల భారీ నుంచి పట్టణ ప్రజలను కాపాడేలా మున్సిపల్ అధికారులకు బుద్ధి కలిగించాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినాయక విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్ని మాట్లాడుతూ పట్టణంలో ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట ఎవరో ఒక్కరూ కుక్కకాటుకు గురవుతున్నారని, దీనిపై మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కుక్కలను ఊరికి దూరంగా తీసుకెళ్లి విడిచిపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, ఆదిల్, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల హైస్కూల్లో భోజనం సరిగాలేదంటూ ఆరోపణలు



రసంలాగా పలుచగా ఉన్న పప్పు

జమ్మలమడుగు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం నాణ్యతతో పెట్టడంలేదని విమర్శలున్నాయి. అందులో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం విద్యార్థినులకు వంట ఏజెన్సీవారు భోజనం ఏర్పాటు చేయగా ఉంటలు కట్టిన భోజనం పెట్టడంతోవిద్యార్థినులు కొందరు తినలేక ఇంటికి వెళ్లిపోయారు. పప్పు కూడా చాలా పలుచగా ఉందని గుడ్లు సన్నవిగా పెడుతున్నారని, అవి కూడా కొన్ని చెడిపోయినవి ఇస్తుండడంతో కొందరు విద్యార్థులు గుడ్లు తీసుకోలేదు. కాగా ఈ విషయమై పాఠశాల్ల హెడ్మాస్టర్ వేదవతిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా తమ పాఠశాలలో 685 మంది విద్యార్థినులు ఉన్నారని, శుక్రవారం 410 మంది మాత్రమే హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన శుభ్రమైన భోజనం అందించేలా చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు.

వైద్యుడి నిర్లక్ష్యం వల్లే చిన్నారి మృతి చెందిందని నిరసన

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ జ్వరం సోకిన తన కుమార్తె వైద్యుడి నిర్లక్ష్యం వల్లే మృతి చెందిదని చిన్నారి తండ్రితోపాటు బంధువులు శుక్రవారం ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చచెప్పి సమస్యను శాంతింపజేశారు. బాధితుడి వివరాల మేరకు ముద్దనూరు మండలం మంగపట్నంకు చెందిన కుబేరారెడ్డి ఆరేళ్ల వయస్సుగల కుమార్తె మేఘనారెడ్డికి గత శనివారం నుంచి తీవ్ర జ్వరంతో ప్రొద్దుటూరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించామని చెప్పారు. మూడు రోజులపాటు వైద్యం అందించి ఏమి పర్వాలేదంటూ భరోసా ఇచ్చారన్నారు. కాగా చిన్నారి పరిస్థితి విషమించే సమయంలో కర్నూలుకు సిఫార్సు చేయగా అక్కడికి వెళ్లి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి చనిపోయినట్లు పేర్కొన్నారు. చివరి క్షణం వరకు వైద్యం పేరిట కాలయాపన చేసి తన కూతురు మరణానికి కారణమైన వైద్యున్ని శిక్షించి తమకు న్యాయం చేయాలని బాధితుడు కోరారు. ఈ విషయమై డాక్టర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా చిన్నారి మేఘన పరిస్థితి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ అయిందని మెరుగైన వైద్యంకోసం కర్నూలుకు సిఫార్సు చేశానని చెప్పారు. అరుదైన కేసులను మాత్రమే అతివేగంగా రక్తకణాలు పడిపోయి క్లిష్టపరిస్థితి ఏర్పడుతుందని అలాంటి సంఘటనే మేఘనారెడ్డికి జరిగిందని ఆయన చెప్పారు.